# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్

12-5-2026

వెల: రూ.5/-

పేజీలు: 10+10

సంపుటి:16

సంచిక: 52

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం తప్పనిసరి అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కేంద్ర సహకారం అవసరమని తెలిపారు. అభివృద్ధి విషయంలో కలిసి పనిచేద్దామని ప్రధాని చెప్పారని.. తమ మధ్య జరిగిన చర్చ పూర్తిగా అభివృద్ధికి సంబంధించినదేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.తెలంగాణ హక్కుల కోసం తాము కేంద్రంతో పోరాడుతామని కూడా వ్యాఖ్యానించారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు.

## అభివృద్ధికి కేంద్ర సహకారం

# తప్పనిసరి

### రాష్ట్రాన్ని అభివృద్ధిలోకి తీసుకు వెళతామని మోడీ అన్నారు

### రాష్ట్ర ప్రాజెక్టుకు అనుమతులను మాత్రమే కోరారం

- రాష్ట్రప్రయోజనాల కోసమే నా పోరాటం
- బిజెపిని ఓడించి సిఎం అయిన వ్యక్తిని నేతు
- బిజెపి అంటే..బ్రిటిష్ జనతా పార్టీ
- విభజించు పాలించడం బిజెపి రాజకీయం
- సర్ పేరుతో రాష్ట్రాల్లో చొరబడే యత్నం
- జెమిని సర్కస్‌లా బిజెపి ఎన్నికల విధానం
- మోడీ పాలనాను భవ రాహిత్యంతో దేశానికి నష్టం
- మీడియాతో సిఎం రేవంత్ రెడ్డి



2లో

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): ఈ చిట్‌చాట్‌లో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ విధానాలు, రాష్ట్ర అభివృద్ధి, మావోయిస్టుల సరెండర్‌లు, మహిళా రిజర్వేషన్లు, రీజినల్ రింగ్ రోడ్, బండి భగీరథ్ కేసు వంటి అనేక కీలక అంశాలపై స్పందించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం హెచ్ఐసీసీలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. హెచ్ఐసీసీలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రధాని మోదీతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాను ప్రస్తావించిన

3లో

## బండి కుమారుడి కేసుపై సిఎం సీరియస్

తోణ విచారణకు డిజిపిని ఆదేశించిన రేవంత్

సిట్ ఏర్పాటు చేస్తూ డిజిపి ఉత్తర్వులు

## చీలిక దిశగా

# అన్నాడీఎంకే

### పళనిస్వామి తీరుపై వేలుమణి వర్గం అసంతృప్తి

- విజయ్ ప్రభుత్వంలో చేరకుండా చేశారని ఆగ్రహం
- శాసనసభాపక్ష నేతగా ఈపీఎస్ కు మద్దతు కరువు
- 47 మంది ఎమ్మెల్యేల్లో సంతకం చేసింది 17 మందే
- 30 మంది ఎమ్మెల్యేలతో వేలుమణి వేరు కుంపటి
- నిట్టనిలువునా చీలిపోయే ప్రమాదంలో రెండు ఆకులు

2లో

తమిళనాడు రాజకీయాల్లో పెను సంచలనం చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. విపక్ష అన్నాడీఎంకే నిట్టనిలువునా చీలిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఆ పార్టీని నడిపిస్తున్న మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామిపై మెజారిటీ ఎమ్మెల్యేలు తిరుగుబాటు బావుటా ఎగరవేసేందుకు సిద్ధమయ్యారు. ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్

## గుప్తనిధుల కోసమే ఆలయం కూల్చివేత

### రేవంత్ డైరెక్షన్‌లోనే కూల్చివేతలు

### కూల్చిన ఆలయం వద్ద పరిశీలించిన హరీష్ రావు



వరంగల్,మే11(ఆర్ఎన్ఎ): లంకెబిందెల కోసమే పురాతమైన ఆలయాలను కూల్చివేస్తున్నారని, సీఎం రేవంత్ రెడ్డికి కూల్చడం తప్ప కట్టడం రాదని

2లో

## ఆర్థిక పరిస్థితిపై దిగజారి మాట్లాడవద్దు

కొత్త సిఎం విజయ్‌కు స్టాలిన్ హెచ్చరిక



## కవిత కొత్త ఆలోచన!



ప్రజల్లోకి పార్టీని తీసుకెళ్లేందుకు గట్టి ప్రణాళిక

నెల రోజులపాటు ఘనంగా జెండా పండుగ

3లో

## బాలినేనికి

# షాక్!

### తీవ్రంగా వ్యతిరేకిస్తున్న జనసేన వర్గాలు

రాయలసీమ బాధ్యతలను కట్టబెట్టడం పై అసంతృప్తి

సమావేశంలోనే ఆయనకు వ్యతిరేకంగా గళం



క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో: జనసేనలో విభేదాలు తీవ్రస్థాయికి చేరుకుంటున్నాయి. పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న వారు వర్సెస్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి చేరిన వారు

2లో



## బండి సంజయ్

# దూకుడు బ్రేక్

### కుమారుడిపై లైంగిక ఆరోపణలు

### ఫోక్సో కేసు నమోదు

### టార్గెట్ చేసిన గులాబీ పార్టీతో పాటు కాంగ్రెస్

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో: ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనతో తెలంగాణ బిజెపిలో జోష్ రావాలి. కానీ దురదృష్టవశాత్తు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు పుణ్యమా అని అటువంటి

## బెంగాల్‌నూతన ప్రభుత్వం కీలక నిర్ణయం

- సరిహద్దుల్లో కంచె ఏర్పాటుకు అంగీకారం
- ఉద్యోగుల పదవీవిరమణ వయసు పెంపు
- మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం

కోల్‌కతా,మే 11(ఆర్ఎన్ఎ):పశ్చిమ బెంగాల్‌లో ఏర్పాటైన నూతన ప్రభుత్వం

2లో



## భారత్ ఎవరికీ తలవంచదు

- సోమనాథ్ అమృత్‌మహోత్సవ్ కార్యక్రమంలో మోదీ వ్యాఖ్య
- సోమనాథ్ ఆలయంలో మహాపూజ చేసిన ప్రధాని
- వీర్ హమీర్జీ సర్కిల్ వద్ద భారీ రోడ్‌షో
- ఆకట్టుకున్న సూర్యకిరణ్ ఏరోబాటిక్ బృందం వైమానిక విన్యాసాలు

3లో



## విజయ్ వెనుక విష్ణు రెడ్డి!

2లో

ఏపీ మాజీ ముఖ్యమంత్రి స్వయానా బావమరిది

పొలిటికల్ వర్గాల్లో హాట్ టాపిక్

క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:తమిళనాడులో నాటకీయ పరిణామాల మధ్య ముఖ్యమంత్రిగా విజయ్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ప్రమాణస్వీకారం చేసిన తర్వాత కీలకమైన మూడు ఫైళ్లపై సంతకం చేశారు విజయ్. ఎన్నికల్లో తాను ఇచ్చిన హామీలను అమలు చేయడానికి కసరత్తు కూడా మొదలుపెట్టారు.

# బండి సంజయ్ దూకుడు బ్రేక్

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితి రాలేదు. సంజయ్ కుమారుడు భగీరథ్ పై నమోదైన ఫోక్సో కేసు బిజెపికి కొత్త తలనొప్పిగా మారింది. తెలంగాణ బిజెపిలో దూకుడు కలిగిన బండి సంజయ్ ను టార్గెట్ చేస్తూ అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు గులాబీ పార్టీ శ్రేణులు ఓ స్థాయిలో విరుచుకుపడుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన వేళ బండి సంజయ్ కుమార్ రెడ్డి వ్యవహారం ఆ పార్టీకి చాలా రకాలుగా ఇబ్బంది తెచ్చి పెట్టింది. ఒక విధంగా చెప్పాలంటే తెలంగాణ బిజెపిలో విభేదాలకు ఒక కారణంగా మారింది. బండి సంజయ్ ఎదుగుదలను సహించలేక సొంత పార్టీ శ్రేణులే ప్రత్యర్థులతో చేతులు కలిపి.. ఇలా బండి సంజయ్ ను పలుచన చేశారు అన్నది పొలిటికల్ వర్గాల్లో ఉన్న వాదన.

**ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ..**

సరిగ్గా ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణలో పర్యటిస్తున్న వేళ బండి సంజయ్ కుమారుడిపై ఈ ఆరోపణలు రావడం మాత్రం హాట్ టాపిక్ అయింది. అయితే ఈ కేసు విచారణపై గులాబీ పార్టీతో పాటు బిజెపి ప్రత్యర్థి వర్గాల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్స్ వస్తున్న వేళ సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. కేసు విచారణలో జాప్యం పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈనెల 8న ఫిర్యాదు అందితే తక్షణ చర్యలు తీసుకోవాల్సిన పోలీస్ అధికారులు ఎందుకు జాప్యం చేశారంటూ సీఎం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు వార్తలు వస్తున్నాయి. కేసు దర్యాప్తు సమర్థవంతంగా, పారదర్శకంగా జరగాలంటే ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి డిజిపి సివి ఆనంద్ కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయితే రాజకీయ విమర్శలు, వివాదాల నేపథ్యంలో ఈ కేసు విచారణ పై ప్రభుత్వం ఎన్నో రకాల జాగ్రత్తలు తీసుకుంటుంది.

**ఆ పార్టీలకు చాన్స్**

అయితే బండి సంజయ్ ఇంతకాలం చాలా దూకుడుగా వ్యవహరిస్తూ వచ్చారు. గతంలో తెలంగాణలో అధికారంలో ఉన్న గులాబీ పార్టీని ముప్పు తిప్పలు పెట్టారు. అలా ఆ పార్టీకి వ్యతిరేకం అయ్యారు సంజయ్. కాంగ్రెస్ పార్టీతో సైతం తాడోపేడో అన్నట్టు వ్యవహరించేవారు. దీంతో ఉభయ వర్గాల వారికి ప్రత్యర్థిగా మారారు బండి సంజయ్. అయితే ఇప్పుడు కుమారుడి రూపంలో వచ్చిన వివాదం బండి సంజయ్ రాజకీయ ప్రత్యర్థులకు వరంగా మారింది. 17 ఏళ్ల మైనర్ బాలికను మద్యం తాగించి లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న ఫిర్యాదు బండి సంజయ్ కుమారుడిపై ఉంది. ఏకంగా ఫోక్సో కేసు నమోదు కావడం రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది. మొయినాబాద్ ఫామ్ హౌస్ లో బాలికను బలవంతంగా మద్యం తాగించి.. లైంగిక వేధింపులకు గురిచేసినట్లు ఫిర్యాదు అదిరింది పోలీసులకు. అయితే ఈ వేధింపులకు తాళలేక సదరు బాలిక రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఆమె తల్లి ఆరోపిస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో హనీ ట్రాక్ అని బండి సంజయ్ కుమారుడు వర్గాలు చెబుతుండగా.. ఇది ముమ్మాటికి లైంగిక వేధింపుల కేసు అని బాధిత వర్గాలు చెబుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో రేవంత్ సర్కార్ ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించింది. అయితే బండి సంజయ్ దూకుడుకు కుమారుడి వ్యవహారం బ్రేక్ వేసింది. మరి తదుపరి పరిణామాలు ఎలా ఉండబోతున్నాయో చూడాలి.

# విజయ్ వెనుక విష్ణు రెడ్డి!

మరోవైపు ప్రతిపక్షాలపై కూడా వస్త్రాలను సిద్ధం చేస్తున్నారు. ఈనెల 13న అసెంబ్లీలో బలపరీక్ష నిరూపించుకునేందుకు సైతం సన్నాహాలు మొదలుపెట్టారు. అయితే విజయ్ పొలిటికల్ వ్యూహంలో భాగంగా తెలుగు నేతలు కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రధానంగా ఏపీ మాజీ ముఖ్యమంత్రి బావమరిది గురించి పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. విజయ్ కోటరిలో సదరు నేత కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. విజయ్ కు అత్యంత సన్నిహిత నేతల్లో ఆయన ఒకరు కావడం గమనార్హం

**విజయం వెనుక వ్యూహం..**

తమిళనాడులో దశాబ్దాల ద్రవిడ పార్టీలను వెనక్కి నెట్టి విజయ్ టీవీ కే అధికారంలోకి వచ్చింది. ఆ రాష్ట్రంలో సరికొత్త రాజకీయ శకం మొదలైంది. ఒకటి రెండు స్థానాల్లో విజయం సాధిస్తారనుకున్న విజయ్ భారీ విజయం వెనుక పెద్ద టీం పని చేసినట్లు పొలిటికల్ వర్గాల్లో ప్రచారం ఉంది. పార్టీలో ప్రధానంగా వినిపించే పేరు విష్ణు రెడ్డి. పార్టీ ఎన్నికల ప్రచారంలోనే కాదు.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమయంలో కూడా విష్ణు రెడ్డి పేరు ప్రముఖంగా వినిపించింది. ఇంతకీ ఈ విష్ణు రెడ్డి ఎవరు అంటే ఆయన మూలం ఏపీ. ఆపై ప్రముఖ రాజకీయ కుటుంబాలతో ఆయనకు మంచి సంబంధాలు ఉన్నాయి.

**వ్యాపారిగా సుపరిచితులు..**

ఏపీకి చెందిన విష్ణు రెడ్డి గ్రానైట్ క్వారీల యజమానిగా సుపరిచితులు. ఆయన పూర్తి పేరు ఎర్రదొడ్డి విష్ణువర్ధన్ రెడ్డి. స్వస్థలం కలికిరి మండలం ఎర్రదొడ్డిపల్లి. గత 15 సంవత్సరాలుగా ఆయన గ్రానైట్ వ్యాపారంలో స్థిరపడ్డారు. ఆయన తండ్రి రామ నారాయణరెడ్డి సైతం సర్పంచ్ గా ఉండేవారు. ఎంపీటీసీ గానే కాదు మండల ఉపాధ్యక్షుడిగా కూడా పదవి చేపట్టారు. ఆపై మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి కుటుంబంతో బంధుత్వం ఉంది. ఆయనకు స్వయానా బావమరిది అవుతారని పొలిటికల్ వర్గాల్లో పెద్ద ఎత్తున ప్రచారం నడుస్తోంది. గతంలో విజయ్ సినిమాలను రూపొందించడంలో విష్ణువర్ధన్ రెడ్డి కీలక పాత్ర పోషించారు. అలా రాజకీయంగాను విజయ్ కు దగ్గరగా మెలిగారు. ఆయన విజయంలోనూ కీలక పాత్ర పోషించారు. అయితే తమిళ నాడు రాజకీయాల్లో సైతం తెలుగు రాష్ట్రానికి చెందిన వ్యక్తి క్రియాశీలక పాత్ర పోషించడం అనేది గర్వించదగ్గ విషయం.

# బెంగాల్ నూతన ప్రభుత్వం కీలక నిర్ణయం

కీలక నిర్ణయం తీసుకుంది. భారత్– బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కంచె నిర్మాణం కోసం బీఎస్ఎఫ్‌కు భూమిని కేటాయిస్తూ తొలి మంత్రివర్గ సమావేశంలోనే నిర్ణయం తీసుకుంది. దీనిపై ముఖ్యమంత్రి సువేందు అధికారి మాట్లాడుతూ.. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే బంగ్లాదేశ్ వెంబడి ఉన్న సరిహద్దుల్లో కంచె నిర్మాణానికి బీఎస్ఎఫ్‌కు భూమిని బదిలీ చేశామన్నారు. మరో 45రోజుల్లో ఈ పక్రియ పూర్తవుతుందన్నారు. కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆయుష్మాన్ భారత్' పథకంతో పాటు ఇతర పథకాలనూ రాష్ట్రంలో అమలు చేయనున్నట్లు ప్రకటించారు. బెంగాల్లో తాము అమలు చేయనున్న అనేక సంక్షేమ పథకాలను సువేందు అధికారి నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం వెల్లడించింది. అందులో జూన్ 1నుంచి రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ల్పించనున్నట్లు ప్రకటించింది. దీనివల్ల ప్రజా రవాణాపై ఆధారపడే లక్షలాదిమంది మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు ప్రయోజనం పొందుతారని అధికారులు పేర్కొన్నారు. పెరుగుతున్న జీవన వ్యయాల నేపథ్యంలో కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. జూన్ 1నుంచి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఆయుష్మాన్ భారత్ పథకం ప్రారంభమైనప్పటికీ.. రాష్ట్రంలో ప్రస్తుతం అమల్లో ఉన్న సామాజిక సంక్షేమ పథకాలూ కొనసాగుతాయని స్పష్టం చేశారు. పాఠశాలల్లో ఉద్యోగాల భర్తీకి వయో పరిమితిని ఐదేళ్లు పొడిగించే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో హామీ ఇచ్చిన విధంగా ఇతర పథకాలనూ త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇచ్చినట్లుగా.. పాఠశాలల్లో ఉద్యోగాల భర్తీకి వయో పరిమితిని ఐదేళ్లు పొడిగించే ప్రతిపాదనకు కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపిందని సువేందు పేర్కొన్నారు. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ జారీ చేసిన జూన్ 2025 జనగణన సర్క్యులర్‌ను గత ప్రభుత్వం విస్మరించిందని.. దానిని తక్షణమే అమలు చేసేలా మంత్రివర్గం నిర్ణయం తీసుకుందన్నారు.

# ఆర్థిక పరిస్థితిపై దిగజారి మాట్లాడవద్దు

చెన్నై,మే11(ఆర్ఎన్ఎ):తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా టీవీకే చీఫ్ జోసెఫ్ విజయ్ ప్రమాణ స్వీకారం చేసి 24 గంటలు గడవకముందే ప్రతిపక్షాలు ఆయనపై విమర్శలకు దిగాయి. ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే చీఫ్ ఎంకే.స్టాలిన్ విజయ్ ప్రసంగాన్ని తప్పుబడుతూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ ఆర్థిక పనితీరును విమర్శించడంపై సీఎం విజయ్‌ను హెచ్చరించారు స్టాలిన్. అప్పులపై శ్వేతపత్రం విడుదల చేస్తామన్న విజయ్ మాటల్ని తప్పుబట్టిన ఆయన.. అబద్ధపు ప్రచారాలు ఆపాలంటూ చురకలంటించారు. 'ప్రభుత్వం వద్ద డబ్బులేదని వెంటనే చెప్పడం ప్రారంభించవద్దు. డబ్బు ఉంది.. కావాల్సింది దానిని ప్రజలకు ఇవ్వాలనే సంకల్పం, పాలించే సామర్థ్యం. ఐదేళ్లుగా కొవిడ్, వరదల వంటి సంక్షోభాలు సహా కేంద్ర బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పోరాడుతూనే.. మేం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశాం. 'గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పును వదిలేసి ఖజానాను ఖాళీ చేసింది' అనే ఆరోపణను మీ మొదటి ప్రసంగంలోనే ప్రస్తావించారు. నిజానికి రాష్ట్రంలో అప్పు పరిమిత స్థాయిలోనే ఉంది. ఫిబ్రవరి బ్జడెట్‌లోనే మేం రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని స్పష్టంగా వివరించాం. ఆ విషయం మీకు తెలియదా? మీకు ఓటు వేసిన ప్రజలను మోసం చేసి.. విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేయవద్దు! 'ఆచరణాత్మకంగా సాధ్యమయ్యే వాగ్దానాలు మాత్రమే ఇస్తాను' అని చెప్పి అధికారంలోకి వచ్చిన మీరు.. ఇప్పుడిప్పుడే ప్రభుత్వ పాలనను ప్రారంభిస్తున్నారు. మాలాగే మీరు కూడా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఎలా నెరవేర్చాలనే మెళకువలను త్వరలోనే తప్పకుండా నేర్చుకుంటారని నమ్ముతున్నాను. మీకు ఓటు వేసిన ప్రజలతో పాటు నేనూ అదే ఆశిస్తున్నాను. మీ పాలనలో తమిళనాడు అభివృద్ధి ప్రస్థానం కొనసాగాలని మరోసారి నా శుభాకాంక్షలు!' అని తన సందేశాన్ని ముగించారు స్టాలిన్. కాగా.. కేంద్రంలో డీఎంకేకు చిరకాల మిత్రపక్షమైన కాంగ్రెస్ మద్దతుతో నిన్న(ఆదివారం) టీవీకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

# బాలినేనికి షాక్!

అన్నట్టు పరిస్థితి ఉంది. తాజాగా రాయలసీమ ప్రాంతీయ జనసేన సమన్వయ సమావేశంలో విభేదాలు భగ్గుమన్నాయి. ప్రధానంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి చేరిన నేతల పెత్తనాన్ని సహించలేక జనసేన సైనికులు బాహటంగానే తమ వ్యతిరేకతను చాటి చెప్పారు. ఒక విధంగా చెప్పాలంటే జనసేనకు ఇది నష్టం కలిగించే విషయమే. పార్టీ ఐక్యత కోసం ఏర్పాటు చేసిన సమావేశంలో నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం హాట్ టాపిక్ అయ్యింది. రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారి తీసింది.

**11 మందితో కమిటీ..**

ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని.. త్వరలో జరగబోయే నియోజకవర్గాల పునర్విభజన విషయంలో జనసైనికుల అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు పవన్ కళ్యాణ్ 11 మంది నేతలతో కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రాంతాలవారీగా నేతలతో ఈ కమిటీలను నియమించారు. అయితే ఇందులో పార్టీ ఎమ్మెల్యేలతో పాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి జనసేనలో చేరిన నేతలను ఎంపిక చేశారు. ప్రధానంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి జనసేనలో చేరిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డికి ఛాన్స్ ఇచ్చారు. మరో ఇద్దరు నేతలతో కలిసి రాయలసీమలోని నాలుగు జిల్లాలతో పాటు నెల్లూరు, ప్రకాశం బాధ్యతలను కట్టబెట్టారు బాలినేని శ్రీనివాస్ రెడ్డికి. అయితే ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు జనసైనికులు. అయితే ఈ కమిటీ ఏర్పాటు చేసిన తర్వాత బాలినేని ఆధ్వర్యంలో ఒక సమావేశం జరిగింది. అయితే వైసీపీ నుంచి వచ్చిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని భావించి జనసేన వర్గం ఒకటి బాహటంగానే వ్యతిరేకించి.. ఈ సమావేశాన్ని బహిష్కరించింది.

**వ్యతిరేకిస్తున్న శ్రేణులు..**

బాలినేని శ్రీనివాస్ రెడ్డి జనసేన లో చేరిక చాలామంది పార్టీ శ్రేణులకు ఇష్టం లేదు. పైగా కూటమిలోని తెలుగుదేశం పార్టీకి చెందిన ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని రాకను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.. ప్రకాశం తో పాటు రాయలసీమ జిల్లాలకు చెందిన నేతలు సైతం బాలినేనిని జనసేనలోకి తీసుకోవడం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇప్పుడు అదే బాలినేనిని రాయలసీమ జిల్లాల బాధ్యుడిగా చేయడం వారికి ఎంత మాత్రం మింగుడు పడడం లేదు. అందుకే ఆయన నేతృత్వంలో జరిగిన సభలో ఆయనకు వ్యతిరేకంగానే గళం ఎత్తి సమావేశాన్ని బహిష్కరించారు. ఆది నుంచి బాలినేని విషయంలో జనసైనికులు వ్యతిరేకత కనబరుస్తున్నారు. ఇప్పుడు బాహటంగా వ్యతిరేకిస్తున్న తరుణంలో అధినేత పవన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

# చీలిక దిశగా అన్నా డీఎంకే

(మొదటి పేజీ తరువాయి)

సారథ్యంలోని టీవీకే ప్రభుత్వంలో అన్నా డీఎంకే చేరకుండా పళనిస్వామి అడ్డుపడటమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఆ పార్టీ శాసనసభాపక్ష నేతగా పళనిస్వామిని ఎన్నుకుంటున్నట్లు తెలిపే లేఖపై 30 మంది ఎమ్మెల్యేలు సంతకాలు చేయలేదు. వారంతా మరోనేత వేలుమణిని నాయకుడిగా కోరుకుంటున్నారు. సినీనటుడు జోసెఫ్ విజయ్ పార్టీ టీవీకే సంచలన విజయం సాధించి అధికారంలోకి రావడం.. రెండు ద్రవిడ పార్టీలను తీవ్రంగా దెబ్బతీసింది. సుపరిపాలన నినాదంతో మరోసారి అధికారంలోకి వస్తామనుకున్న డీఎంకే ఆశలపై టీవీకే నీళ్లు చల్లడంతోపాటు అన్నా డీఎంకేను మూడోస్థానంలోకి నెట్టింది. జయలలిత మరణం తరువాత ఆ పార్టీ ఆకర్షణ కోల్పోగా.. వరుసగా రెండోసారి కూడా అధికారం దక్కకపోవడంతో పార్టీని కాపాడటం పళనిస్వామికి కష్టమేనన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. పార్టీలో పరిణామాలు కూడా అలాగే కనిపిస్తున్నాయి. పళనిస్వామి నాయకత్వంపై అసంతృప్తితో ఉన్న ఓ వర్గం తిరుగుబాటు చేసే యోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందుకు నిదర్శనంగా పళనిస్వామిని ఏఐడీఎంకే శాసనసభాపక్ష నేతగా ఎన్నుకునేందుకు కేవలం 17 మంది ఎమ్మెల్యేలు మాత్రమే సంతకాలు చేసిన లేఖను చూపుతున్నారు. ఆ పార్టీకి మొత్తం 47 మంది ఎమ్మెల్యేలు ఉండగా, సుమారు 30 మంది ఎమ్మెల్యేలు శాసనసభాపక్ష నేతగా పళనిస్వామి పేరుపై విముఖత చూపుతున్నారని అంటున్నారు. నిజానికి ఎన్నికల ఫలితాల అనంతరం టీవీకేతో పొత్తు పెట్టుకోవాలని ఎక్కువ మంది ఎమ్మెల్యేలు భావించారు. విజయ్ కి మద్దతు ప్రకటిస్తే తమకు అధికారంలో వాటా దక్కుతుందని భావించారు. కానీ, పళనిస్వామి మాత్రం డీఎంకే మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి.. తానే ముఖ్యమంత్రి కావాలనుకున్నారు. కానీ, ఈ ప్రయత్నాలు ఫలించకపోవడంతో మరోసారి ప్రతిపక్షానికే పరిమితం కావాల్సి వచ్చింది. పళనిస్వామి వైఖరే ఇందుకు కారణమని భావిస్తున్న అత్యధిక మంది ఎమ్మెల్యేలు ఇప్పుడు ఆయనపై ఆగ్రహంగా ఉన్నారని తెలుస్తోంది. బద్ధశత్రువైన స్టాలిన్ తో చేతులు కలిపేందుకు సిద్ధమైనప్పుడు విజయ్ తో కలిస్తే తప్పేంటని ప్రశ్నిస్తున్నారు.

**అధికారంపై ఆశలు..**

పలు చిన్న పార్టీల మద్దతుతో విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసినా.. తమ మద్దతును కూడా ప్రకటిస్తే ఏదో ఒకరోజు అధికారంలో భాగస్వాములం అవుతామని అన్నా డీఎంకే ఎమ్మెల్యేలు ఆశపడుతున్నారు. పళనిస్వామి ఇందుకు అంగీకరించే అవకాశం లేనందున.. ఆయనకే దూరంగా ఉండాలనే నిర్ణయానికి వారంతా వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. కానీ, ఈ అంశంపై పళనిస్వామి నుంచి మాత్రం ఎటువంటి స్పందన రావడంలేదు. వాస్తవానికి ఎన్నికలకు ముందే అన్నాడీఎంకేలో లుకలుకలు చోటుచేసుకున్నాయి. మాజీ సీఎం పన్నీరు సెల్వం ఎన్నికలకు ముందు డీఎంకేలో చేరగా, సీనియర్ నేతలు శశికళ, దినకరన్ వంటి వారు సొంతంగా పార్టీ పెట్టుకున్నారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో దక్షిణ తమిళనాడులో ఊహించని పరాభవం ఎదురుకావడం కూడా పార్టీ శ్రేణులను భయాందోళనకు గురిచేస్తోందని అంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఈపీఎస్ తీరును నిరసిస్తూ 30 మంది ఎమ్మెల్యేలు వేరు కుంపటి పెట్టేందుకు రెడీ అవుతున్నారని ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే తమిళ రాజకీయాల్లో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని అంటున్నారు.

# బండి కుమారుడి కేసుపై సిఎం సీరియస్

హైదరాబాద్,మే11( ఆర్ఎన్ఎ): కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ కేసుపై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. భగీరథ్‌పై పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుపైన తక్షణమే విచారణ మొదలుపెట్టాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను సీఎం ఆదేశించారు. మే 8న ఫిర్యాదు వస్తే ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని డీజీపీని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. కేసు వివరాలను సీఎంకు డీజీపీ వివరించారు. ప్రధాన మంత్రి మోదీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో పోలీస్ సిబ్బంది అంతా భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారని తెలియజేశారు. కేసు సమగ్ర విచారణ కోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయాలని డీజీపీ ఆనంద్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. బండి భగీరథ్‌పై ఈనెల 8న పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఓ ఫిర్యాదు వచ్చింది. తనను భగీరథ్ వేధిస్తున్నారని, పోక్సో కింద కేసు నమోదు చేయాలని ఓ మైనర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇప్పటి వరకు భగీరథ్‌పై పోలీసు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పాటు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయనట్లు తెలుస్తోంది. ఈ అంశం తెలంగాణ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కేంద్ర మంత్రి కుమారుడిని ప్రభుత్వమే కాపాడుతోందంటూ ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్న పరిస్థితి నెలకొంది. తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడి కేసులో ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఈ కేసును సమగ్రంగా విచారించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేస్తూ తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసు ప్రస్తుతం రాజకీయ, సామాజిక వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ కేసు సున్నితమైనది కావడంతో దర్యాప్తును మహిళా ఐపీఎస్ అధికారిణి పర్యవేక్షణలో కొనసాగించాలని డీజీపీ నిర్ణయించారు. బాధితురాలు బాలిక కావడం, ఈ కేసులో ఉన్న ఆరోపణల తీవ్రత దృష్ట్యా విచారణలో ఎలాంటి లోపాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సిట్ బృందం ఇప్పటికే కేసుకు సంబంధించిన ఆధారాలను సేకరించే పనిని ప్రారంభించినట్లు సమాచారం. పోలీసులు బాలిక స్టేట్మెంట్‌ను చట్టపరమైన నిబంధనల ప్రకారం రికార్డ్ చేశారు. ఈ ప్రకటన ఆధారంగా మరిన్ని అంశాలను వెలికి తీసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. విచారణలో భాగంగా సీసీటీవీ ఫుటేజీలు, కాల్ డేటా, డిజిటల్ ఆధారాలు కూడా పరిశీలించే అవకాశముంది. ఈ ఘటనపై హైదరాబాద్ పరిధిలోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌పై కేసు నమోదు చేశారు.

# గుప్తనిధుల కోసమే ఆలయం కూల్చివేత

శాసనసభ విపక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. వరంగల్ జిల్లా ఖానపురం మండలం అశోక్ నగర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేసిన 800 ఏండ్ల చారిత్రక కాకతీయ కట్టడం శివాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గుప్త నిధుల కోసం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపించారు. స్కూల్ నిర్మాణం కోసం అయితే అర్ధరాత్రి తవ్వకాలు ఎందుకు చేపట్టారని ప్రశ్నించారు. గర్భగుడి కింద 24 అడుగుల లోతు తవ్వాకాలు చేపట్టారని పురావస్తు శాఖ తేల్చింది. ఆలయాల కూల్చివేతపై ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుంత్వం రాగానే దేవాదాయ శాఖ భూమి ప్రభుత్వ భూమిగా మారిందన్నారు. గుప్త నిధుల వేటలో ప్రభుత్వ పెద్దలు ఉన్నారన్నారు. పేదల ఇళ్లతో పాటు గుళ్లను కూల్చివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ నాయకత్వంలో వరంగల్ జిల్లాలో ఎన్నో ఆలయాలను పునరుద్ధరించామని గుర్తు చేశారు. రామప్ప ఆలయానికి బీఆర్ఎస్ యునెస్కో గుర్తింపు తీసుకొచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ధ్వంసం చేసిన శివాలయాన్ని పునర్నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సూదర్శన్ రెడ్డి, దాస్యం వినయ భాస్కర్, అరూరి రమేష్, శంకర్ నాయక్ తదితరులు ఉన్నారు.




# అభివృద్ధికి కేంద్ర సహకారం తప్పనిసరి

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి అంశాలను ప్రధాని మోదీ అంగీకరించారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్ర సహకారం అవసరమని, అదే విషయాన్ని మోదీ దృష్టికి తాను తీసుకెళ్లానని చెప్పుకొచ్చారు. 'నేను బీజేపీని ఓడించిన ముఖ్యమంత్రిని... కానీ రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిందే' అని వ్యాఖ్యానించారు. గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం కేంద్రాన్ని నిధులు అడగలేదని, తాము మాత్రం తెలంగాణ హక్కుల కోసం అడుగు తున్నామని పేర్కొన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో ప్రధాని మోదీ సమావేశం కావడం ప్రైవేట్ కార్యక్రమమని చెప్పుకొచ్చారు. అలాగే తమతో కలిసి రావాలన్న ప్రధాని మోదీ పిలుపును స్వాగతిస్తున్నామని తెలిపారు. ప్రధాని అధికారిక కార్యక్రమంలో పాల్గొన్నానని, ఆయన పిలుపులో రాజకీయాలకు తావులేదని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమంలో కేంద్రంతో కలిసి వెళ్లేందుకు తనకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. వికసిత్ భారత్‌లాగే విజన్ 2047 సాధనకు, 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ అందుకునేందుకు కేంద్రంతో కలిసి నడుస్తామన్నారు. కేంద్రం, రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణితో ముందుకెళ్లాలని తెలిపారు. తమ పార్టీలు, ఐడియాలజీ వేరైనా.. అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తామన్నారు. ఎన్నోసార్లు కలిసినా.. కేంద్రం నుంచి ఆశించిన మద్దతు రాలేదని, 2 గంటలు సమయమిస్తే తమ ప్రణాళికలు ప్రధానికి వివరిస్తామని చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్ ప్రాజెక్టుకు కేందప్రభుత్వం 50 శాతం నిధులు ఇవ్వాలని కోరామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మెట్రో, సదరన్ పార్ట్ రీజినల్ రింగ్ రోడ్ వంటి కొన్ని ప్రాజెక్టులు

ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఎయిర్‌పోర్ట్ క్లియరెన్స్‌లు, డిఫెన్స్ ల్యాండ్స్, మూసీ ప్రాజెక్టుకు ఏడీబీ నిధులు, నేషనల్ హైవేలకు అనుమతులు వచ్చినట్లు వెల్లడించారు. కేసీఆర్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఈ పనులు ఆలస్యమయ్యాయని ఆరోపించారు. 2034 నాటికి తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని తాను ప్రధాని మోదీని కోరగా ఆయన అంగీకరించారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీని 'బ్రిటిష్ జనతా పార్టీ'గా సీఎం రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. విభజించి పాలించడం ఆ పార్టీ సిద్ధాంతమని ఆరోపించారు. ముస్లింలు, క్రిస్టియన్లు, మావోయిస్టులు కూడా ఈ దేశ ప్రజలేనని,



అందరికీ సమాన హక్కులు ఉన్నాయని పేర్కొన్నారు. బీజేపీ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వారిని ఖతం చేయడం వాళ్ల విధానమని విమర్శించారు. తమ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వారిని ఒప్పించి జనజీవనంలో కలపడం కాంగ్రెస్ విధానమని వ్యాఖ్యానించారు. విదేశీ విధానంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. కేంద్రానికి స్పష్టమైన విధానం లేదన్నారు. జెమిని సర్కస్ లా బీజేపీ ఎన్నికల విధానం ఉంటుందని ఎద్దేవా చేశారు. అనుభవరాహిత్యం, అహంకారం వల్లనే దేశాన్నిసంక్షోభంలోకి నెడుతున్నారని ఆరోపించారు. ఎస్ఐఆర్‌ను బీజేపీ ఆయుధంగా ఉపయోగిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. పశ్చిమబెంగాల్‌లో 90 లక్షల ఓట్లను తొలగించారని ఆరోపించారు. కేరళంలో 3 సీట్లు, తమిళనాడులో ఒక సీటు మాత్రమే బీజేపీ గెలుచుకుందని ప్రస్తావించారు. ఏ రాష్ట్రంలో గెలవాలంటే అక్కడ ఎస్ఐఆర్‌ను ప్రయోగిస్తున్నారని ఫైర్ అయ్యారు. జూబ్లీహిల్స్‌లో బీజేపీకి డిపాజిట్ రాలేదని.. మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ పరిస్థితి ఏమిటని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. బీజేపీ రెండు సీట్లతో ప్రారంభమైందని..అక్కడికే వస్తుందని విమర్శించారు. కాంగ్రెస్‌ను మోదీ విమర్శిస్తే తనను విమర్శించినట్లేనని అన్నారు. కేంద్రం నుంచి తెలంగాణకు ఆశించిన మేరకు సహకారం లేదని చెప్పారు. బీజేపీకి ప్రజాస్వామ్యంపైన నమ్మకం లేదని మండిపడ్డారు. తమిళనాడులో అతిపెద్ద పార్టీకి ప్రభుత్వ ఏర్పాటు కోసం గవర్నర్ ఆహ్వానించకుండా నిర్లక్ష్యం ఎందుకు చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ జపం చేయకుండా బీజేపీ బతకదని విమర్శించారు. తెలంగాణలో 818 మంది మావోయిస్టులు సరెండర్ అయ్యారని, దేశంలో ఎక్కడా ఇలాంటి పరిస్థితి లేదని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. బుల్లెట్ కాదు బ్యాలెట్ అని కాంగ్రెస్ ఎప్పటి నుంచో చెబుతోందని, చివరకు మావోయిస్టులు కూడా అదే మార్గంలోకి వచ్చారని అన్నారు. మావోయిస్టుల లొంగుబాటుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని చెప్పారు. గణపతి వంటి నేతలు కూడా జనజీవన స్రవంతిలోకి రావాలని పిలుపునిచ్చారు. అవసరమైతే వైద్య సహాయం, ఆర్థిక సాయం కూడా అందిస్తామని తెలిపారు. దేశం కోసం కాంగ్రెస్ ప్రాణాలు ఇచ్చిందని ఉద్ఘాటించారు. రాజీవ్ గాంధీని చంపిన వాళ్లకు కూడా సోనియా గాంధీ క్షమాభిక్ష పెట్టారని ప్రస్తావించారు.ప్రధాని మోదీ మాట్లాడిన కొన్ని మాటలు దురదృష్టకరమని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. బంగారం కొనొద్దు, విమానాల్లో ప్రయాణం చేయొద్దని ప్రజలకు చెప్పడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. విదేశాంగ విధానంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రతిపక్షాల సూచనలు తీసుకోవాలని, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని కేంద్రానికి సూచించారు. మోదీ అనుభవ రాహిత్యం, అహంకారం వల్ల దేశాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్‌ను దేనికి సంబంధం లేకుండా అమలు చేయడానికి అవకాశం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళా రిజర్వేషన్లు అమలు చేయొచ్చని అన్నారు.

# కవిత కొత్త ఆలోచన!

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో పార్టీ విస్తరణ పై దృష్టి పెట్టారు కల్వకుంట్ల కవిత. రాష్ట్రంలో సరికొత్త రాజకీయాలను చేపడుతూ ప్రజల్లోకి వెళ్లాలని గట్టిగానే నిర్ణయం తీసుకున్నారు. మొన్ననే తెలంగాణ రక్షణ సేన పేరిట పార్టీని ఏర్పాటు చేసిన కవిత తదుపరి చర్యలు ఎలా ఉండబోతున్నాయని చర్చ బలంగా నడుస్తోంది. సరిగ్గా ఇటువంటి సమయంలోనే భారీ ప్రణాళికతో ముందుకు వస్తున్నారు కవిత. ఈనెల 15 నుంచి నెల రోజులపాటు భారీ జెండా పండుగ నిర్వహించాలని తెలంగాణ రక్షణ సేన కార్యకర్తలకు ఆమె పిలుపునిచ్చారు. రాష్ట్ర రాజధాని నుంచి వార్డు స్థాయి వరకు ప్రతి చోట తెలంగాణ రాష్ట్ర సేన జెండాలు ఎగురవేయాలని ఆదేశించారు. అయితే కేవలం పార్టీ భావజాలాన్ని గ్రామీణ స్థాయికి తీసుకెళ్లాలన్నదే కవిత లక్ష్యంగా కనిపిస్తోంది.

**టిఆర్ఎస్ పేరుతో...**

తన పార్టీని తెలంగాణ రక్షణ సేనగా ప్రకటించి.. పూర్వపు టీఆర్ఎస్ ను తన ఆధీనంలోకి తెచ్చుకున్నారు కల్వకుంట్ల కవిత. ఇదే ఊపుతో పార్టీని ప్రజల్లోకి క్షేత్రస్థాయిలో తీసుకెళ్లేందుకు ఆమె గట్టి చర్యలే ప్రారంభించారు. ఈనెల 15 నుంచి జెండా పండుగను నిర్వహించాలని భావించారు. మే 20 నుంచి జూన్ 20 వరకు నెల రోజులపాటు రాష్ట్ర రాజధాని, జిల్లా కేంద్రాలు, నియోజకవర్గాలు, మండల కేంద్రాలు, గ్రామస్థాయిలో సైతం పార్టీ జెండాను ఎగురవేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు కల్వకుంట్ల కవిత. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ ఆవిర్భావ సభలో ప్రకటించిన పార్టీ విధానాలను, పాంచ జన్య సిద్ధాంతాలను ప్రజలకు వివరించాలని కవిత సూచించారు.

**విభిన్న అజెండాతో..**

ఒకవైపు ప్రత్యేక రాష్ట్ర సెంటిమెంటును పదిలంగా ఉంచుతూనే.. రాష్ట్ర అభివృద్ధి అనే ప్రధాన అంశంగా ప్రజల్లోకి వెళ్లాలని భావిస్తున్నారు కల్వకుంట్ల కవిత. తెలంగాణ ఆవిర్భవించి పుష్కరకాలం అవుతున్న ఇంకా అనేక సమస్యలు రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్నాయని ఆమె విచారం వ్యక్తం చేశారు. నీళ్లు,నిధులు, నియామకాలు అనే తెలంగాణ ఉద్యమ నినాదాలు సాకారం కాలేదని బలంగా అభిప్రాయపడుతున్నారు కవిత. ఒకవైపు తెలంగాణ సెంటిమెంటును బలంగా తీసుకెళ్తూనే.. అభివృద్ధి అనే నినాదాన్ని తెలంగాణ సమాజం వైపు తీసుకెళ్లాలన్నది ఆమె ప్రణాళికగా తెలుస్తోంది. మరి అందులో ఆమె ఎంతవరకు సక్సెస్ అవుతారో చూడాలి.

# భారత్ ఎవరికీ తలవంచదు

సోమనాథ్(గుజరాత్): అమెరికా వంటి అగ్రరాజ్యాలకు సైతం ఏమాత్రం బెదరక భారత్ తన లక్ష్యసాధనలో సఫలీకృతమైందని ప్రధాని మోదీ శ్లాఘించారు. 1998లో పోఖ్రాన్ అణుపరీక్షలపై అమెరికా ఒత్తిళ్లు ఉన్నప్పటికీ భారత్ ఏమాత్రం తన సంకల్పాన్ని సడలనివ్వలేదని మోదీ గుర్తుచేశారు. గుజరాత్‌లోని ప్రభాస్ పాటన్‌లో అరేబియా సముద్రతీరంలో ఆధునిక సోమనాథ్ ఆలయాన్ని పునర్‌నిర్మించి 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా చేపట్టిన అమృత్‌మహోత్సవ్ కార్యక్రమాల్లో ప్రధాని మోదీ సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సద్భావన మైదాన్‌లో నిర్వహించిన 'సోమనాథ్ పునర్‌వైభవానికి 75 ఏళ్లు'సభలో మోదీ ప్రసంగించారు. "1947లో భారత్ విదేశీపాలకుల నుంచి స్వాతంత్ర్యంపొందినప్పటికీ 1951లో సోమనాథ్‌లో ఆధునిక ఆలయంలో ప్రాణప్రతిష్ట జరిగిన క్షణంలోనే నిజమైన స్వేచ్ఛా స్ఫూర్తి దేశం నలుచెరుగులకూ వ్యాపించింది. సోమనాథ్‌లో జరుగుతున్న అమృత్ మహోత్సవం కేవలం ఒక స్మరణీయ కార్యక్రమం కాదు ఇది వచ్చే వెయ్యేళ్లపాటు మనకందించే స్ఫూర్తి సంబరం. మే 11 అనగానే కేవలం ఆధునిక సోమనాథ్ ఆలయ పునర్‌నిర్మాణం గుర్తుకురాదు నాటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ నాయకత్వంలో 1998లో భారత్ చేపట్టిన అణుపరీక్షలూ ఇదే తేదీన జరిగాయి. ఇదే రోజున మన శాస్త్రవేత్తలు దేశ అణుశక్తి సామర్థ్యాలు, సత్తాను యావత్ ప్రపంచానికి చాటిచెప్పారు. అణుపరీక్షల భూప్రకంపనలు



ప్రపంచదేశాల్లో వణుకుపుట్టించాయి. కొన్ని దేశాల్లో ఆగ్రహజ్వాలలను రగిల్చాయి. అణుపరీక్షలు చేసే హక్కు భారత్‌కు ఎక్కడి నుంచి వచ్చింది? అంటూ పలు దేశాలు హూంకరించాయి. ఆర్థిక ఆంక్షల మాటున భారత్‌ను ఏకాకిని చేసే కుట్రలుచేశాయి. భారత్‌ను అణగదొక్కేందుకు ప్రపంచశక్తులు ఏకమయ్యాయి. కఠిన ఆంక్షలనూ ఇండియాపై మోపారు. ఇంతటి విపత్కర పరిస్థితుల్లో ఇంకేదైనా దేశమైతే కూలబడేదే. కానీ భారత్ విభిన్నం. అన్నింటినీ తట్టుకుని భారత్ సగర్వంగా నిలబడింది. అంతర్జాతీయ సమాజం నుంచి ఒత్తిళ్లున్నా 13న మరోసారి అణుపరీక్షలుచేసింది. మే 11న శాస్త్రవేత్తలు తమ ఆరంభకార్యాలను పూర్తిచేయగా 13న మరోరెండు అణుపరీక్షలుచేసి వాజ్‌పేయీ సారథ్యంలో బీజేపీ ప్రభుత్వ రాజకీయ సంకల్పాన్ని రుజువుచేశారు"అని మోదీ అన్నారు. "మూలాలను మర్చిపోయిన దేశం పటిష్టంగా ఉండలేదన్న సత్యాన్ని సోమనాథ్ మనకు ప్రబోధిస్తోంది. అద్భుత సోమనాథ్‌ను నాశనంచేసేందుకు చరిత్రలో పలుమార్లు విదేశీ పాలకులు, చొరబాటుదారులు ఎంతగానో ప్రయత్నించారు. పునర్‌నిర్మించినా మళ్లీ కూల్చేశారు. అయినాసరే ఆలయం పునర్‌నిర్మితమైంది. ఇది నిరంతరంగా కొనసాగింది. ఆలయాన్ని నాశనంచేసినట్లే దేశాన్ని సైతం కొన్ని శక్తులు బుజ్జగింపు రాజకీయాలతో భ్రష్టుపట్టించాయి. అలాంటి ఆలోచన ధోరణితోనే కొన్ని శక్తులు అయోధ్య రామమందిర నిర్మాణాన్ని అడ్డుకోవాలనిచూశాయి. జాతి ప్రతిష్ట, గుర్తింపునకు సంబంధించిన ఇలాంటి అంశాల్లోకి ఒక్కోసారి రాజకీయాలు చొరబడుతుంటాయి"అని అన్నారు. "ఆలయ నిర్మాణంపై నెహ్రూ అభ్యంతరాలు వ్యక్తంచేశారు. అయినాసరే ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌భాయ్‌పటేల్, తొలి రాష్ట్రపతి డాక్టర్‌రాజేంద్ర ప్రసాద్ ఆధునిక సాంస్కృతిక సౌధం సోమనాథ్ పునర్‌నిర్మాణానికి పట్టుబట్టి సాధించారు. అయోధ్యలో భవ్యమందిర నిర్మాణానికి పూనుకున్నప్పుడూ ఇలాంటి శక్తులు అడ్డుతగిలాయి. అయినాసరే మనం అభివృద్ధి, వారసత్వ పరంపరను ముందుకు తీసుకెళ్లాల్సిందే. గతంలో ఇలాంటి సాంస్కృతిక కేంద్రాలను నిర్లక్ష్యంచేసిన ఫలితాలను నేటికీ అనుభవిస్తున్నాం. నేటి భారతంలో సాంస్కృతిక వారసత్వం, అభివృద్ధి అవిభాజ్యాలు. జంటగా పురోభివృద్ధి సాధించాల్సిందే"అని అన్నారు. ఈ సందర్భంగా మోదీ సోమనాథ్ ఆలయానికి సంబంధించిన స్మారక తపాలాబిళ్లను ఆవిష్కరించారు.

## ప్రజా సమస్యలపై సిఎంసి అధికారుల పరిశీలన



గండిపేట(క్రైం మిర్రర్): మణికొండ పరిధిలోని ఎంప్లాయిస్ కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోని వాటి పరిష్కార మార్గాలపై చర్యలు చేపట్టేందుకు జీహెచ్ఎంసీ కమిషనర్ శ్రీజన, జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి లతో పాటు ఇతర జీహెచ్ఎంసీ అధికారులు సోమవారం అబ్దుల్ కలాం పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో ప్రత్యేక సమావేశం నిర్వహధించి స్థానిక సమస్యలను ప్రత్యేక్షంగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కొండకళ్ల నరేందర్‌రెడ్డి, ఆల్ కాలనీ ప్రెసిడెంట్లు, సెక్రటరీలు, డా కాలనీ ప్రెసిడెంట్ రాజశేఖర్, సీనియర్ సిటిజన్స్? ఆఫ్ మణికొండ జనరల్ సెక్రటరీ రఘు, సతీష్‌కుమార్, వైఎస్ఆర్ కాలనీ ప్రతినిధులు, సిటిజన్ కౌన్సిల్ చైర్మన్ దూళిపాళ సీతారాం, బీవీపీ బ్రాంచ్ ప్రెసిడెంట్ పెంటారెడ్డి, కాలనీ ప్రెసిడెంట్ గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ వైస్ చైర్మ న్ కొండకళ్ల నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ దుర్గామాత ఆలయం అవతలి భాగంగా శేరిలింగంపల్లి పరిధిలోకి రావడం వల్ల అభివృద్ధి పనుల్లో 50–50 భాగస్వామ్యం విధానం కారణంగా ఆలస్యం జరుగుతుందని తెలిపారు. పందెం వాగు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. సీనియర్ సిటిజన్స్? ఆఫ్ మణికొండ జనరల్ సెక్రటరీ రఘు, సతీష్‌కుమార్‌లు మాట్లాడుతూ శ్రీ చైనత్య కాలనీలోని త్రివేణి క్లాసిక్, శ్రీదత్త, క్యూరిస్ హోమ్స్? అపార్ట్?మెంట్ల డైనేజీ లైన్లుకొత్త డైనేజీ వ్యవస్థకు అనుసంధానం కాకపోవడంతో ప్రతి నెలా సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. సీనియర్ సిటిజన్ల కోసం ప్రత్యేక లైబ్రరీ లేదా సమావేశ మందిరం ఏర్పాటు చేయాలని, వీధి కుక్కల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో నీటి ఎద్దడి సమస్యను తగ్గించవచ్చని సూచించారు. డా కాలనీ ప్రెసిడెంట్ రాజశేఖర్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం పార్క్?లో స్టేజ్, వాకింగ్ ట్రాక్, బోర్‌వెల్ సదుపాయం కల్పించాలని, మహాత్మాగాంధీద పార్క్?ను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే స్ట్రీట్ వెండర్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. సిటిజన్ కౌన్సిల్ చైర్మన్ దూళిపాళ సీతారాం మాట్లాడుతూ ఎస్టిపిని 9 మీటర్లలోతుతో అబివృద్ధి చేసి శాశ్వత తనిఖీ వ్యవస్త ఏర్పాటు చేయాలని సూచించారు. ఆల్ కాలనీ ప్రతినిధులు బస్షెల్టర్ పునరుద్దరణ కోరగా, గోవర్ధన్‌రెడ్డి, పెంటారెడ్డి పందెం వాగు రేకులను సరి చేసి వర్షపు నీరు సక్రమంగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులను అభ్యర్థించారు. వంశీకృష్ణ కూడా కాలనీలోని పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కాలనీ వాసుల సమస్యలను శ్రద్ధగా విన్న జీహెచ్ఎంసీ అధికారులు వాటిని దశల వారిగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

## రాళ్లగూడా రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి

**పనుల ఆలస్యం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు**

**కొత్వాల్‌గూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్**

**గండిపేట(క్రైం మిర్రర్):** శంషాబాద్ మండలంలోని రాళ్లగూడా రోడ్డు వెడల్పు, నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేయాలని కొత్వాల్‌గూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కొత్వాల్‌గూడలో ఆయన ఆధ్వర్యంలో నిరసన ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో స్థానిక ప్రజలు, యువత, మహిళలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని రోడ్డుపై సడక్ బంద్ నిర్వహించారు. రోడ్డు పనుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కొనమొల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ గత తొమ్మిది నెలలుగా రాళ్లగూడా రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయని, సంబంధిత అధికారులు మరియు కాంట్రాక్టర్లు ప్రజల సమస్యలను



పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రోడ్డు పనుల కారణంగా ఎక్కడ చూసినా దుమ్ము, ధూళి వ్యాపించి స్థానిక ప్రజలు శ్వాసకోశ సమస్యలు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు మరియు రోజువారీ కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించకపోతే రానున్న రోజుల్లో కార్యాలయాన్ని ముట్టడించి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బుచ్చి రెడ్డి, రాజేందర్, రాచమల్ల జయసింహ, మంచర్ల శ్రీనివాస్ ,మల్లేష్ ముదిరాజ్ బైరమోని,చిలకమర్రి పరందములు సల్వేంద్రి వెంకట్ రెడ్డి,పెదిరిపాటి మురళి గౌడ్, వీరమల్ల హనుమంతు ,పవిత్ర సాగర్, కొండ దర్శన్, విజయ్ గౌడ్, మురళి గౌడ్ ,రాచమల్ల రమేష్ , రాహుల్ అప్ప, రమేష్ రాథోడ్,గుంటి చరణ్ ,బక్క శ్రీకాంత్, పెట్రోల్ సాయి, రాచమల్ల కార్తీక్, బాత్కు మహేష్ , తుప్పర సునీల్ తో పాటు కార్యకర్తలు, యువజన నాయకులు పాల్గొన్నారు.

## ఎడిటోరియల్

# తమిళనాడు ఒకే ఒక్కడు స్టాలిన్ కోటను బద్దలు కొట్టిన విజయ్ వ్యూహం!



తమిళనాడు రాజకీయ యవనికపై 2026 అసెంబ్లీ ఎన్నికలు ఒక మహా విప్లవాన్ని ఆవిష్కరించాయి. దశాబ్దాలుగా ద్రావిడ దిగ్గజాలైన డీఎంకే ( DMK ), ఏఐఏడీఎంకే ( AIDMK ) మధ్య దోబూచులాడిన అధికారం, ఈసారి ఒక సరికొత్త శక్తి వైపు మళ్లింది. అతనే జోసెఫ్ విజయ్ చంద్రశేఖర్, అభిమానుల గుండెల్లో " తలపతి ". ఆయన స్థాపించిన తమిళగ వెట్రి కళగం (TVK) పార్టీ 234 స్థానాల్లో 108కి పైగా స్థానాలను కైవసం చేసుకుని, మేజిక్ ఫిగర్‌ను(ఇతర పార్టీ సభ్యులతో కలుపుకొని ) దాటేయడం కేవలం ఒక ఎన్నికల విజయం మాత్రమే కాదు. అది ఒక సామాజిక మార్పుకు సంకేతం.సినిమా గ్లామర్‌తో రాజకీయాల్లోకి రావడం తమిళనాడుకు కొత్త కాదు. ఎంజీఆర్, జయలలిత వంటి వారు ముఖ్యమంత్రులుగా రాణించారు. కానీ విజయ్ రాకలో ఒక ప్రత్యేకత ఉంది. ఆయన తన సినీ కెరీర్ శిఖరాగ్రంలో ఉన్నప్పుడే, తన 30 ఏళ్ల నట జీవితానికి స్వస్తి పలికి, 2024లో రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఇది ఆయన చిత్తశుద్ధిని ప్రజలకు చాటిచెప్పింది.సరికొత్త రాజకీయ శక్తిగా ఉద్భవించిన తమిళగ వెట్రి కళగం (౧ఎఖ) గణాంకాలను పరిశీలిస్తే, ఆ పార్టీ సాధించిన ప్రభంజనం స్పష్టంగా కనిపిస్తుంది. జోసెఫ్ విజయ్ ఫిబ్రవరి 2024లో ఈ పార్టీని స్థాపించిన అతి తక్కువ కాలంలోనే, 2026 అసెంబ్లీ ఎన్నికల్లో తమిళనాడులోని మొత్తం 234 స్థానాలకు గాను 108కి పైగా స్థానాలను కైవసం చేసుకుని (ఇతర పార్టీ సభ్యులతో కలుపుకొని ) మ్యాజిక్ ఫిగర్‌ను దాటేసింది. దాదాపు 52 శాతం ఓట్ల వాటాను సాధించడం ఆ పార్టీ పట్ల ప్రజల్లో ఉన్న బలమైన విశ్వాసానికి నిదర్శనం. ముఖ్యంగా మార్పును కోరుకున్న యువత మరియు మహిళా ఓటర్లే ఈ చారిత్రాత్మక విజయానికి ప్రధాన బలముగా నిలిచారు, ఇది రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేసింది.ఒక కొత్త పార్టీ రెండు ప్రధాన పార్టీలను ఢీకొట్టి గెలవడం వెనుక పక్కా వ్యూహం ఉంది. రాజకీయ విశ్లేషకులు విజయ్ విజయాన్ని ప్రధానంగా మూడు సూత్రాలతో విశ్లేషిస్తున్నారు.యువశక్తి మద్దతు తమిళనాడు ఓటర్లలో దాదాపు 42% మంది 35 ఏళ్లలోపు వారే. వీరిలో నిరుద్యోగం, వ్యవస్థపై అసంతృప్తి ఎక్కువగా ఉన్నాయి. విజయ్ వారి భాషలో మాట్లాడారు, వారి ఆకాంక్షలను ప్రతిబింబించారు.డీఎంకే ప్రభుత్వంపై వచ్చిన భూ కబ్జా ఆరోపణలు, కుటుంబ పాలన విమర్శలను విజయ్ తన ప్రచార అస్త్రాలుగా మార్చుకున్నారు. వంశ పారంపర్య రాజకీయాలకు చరమగీతం పాడుదాం అన్న ఆయన పిలుపు సామాన్య ప్రజలను ఆకట్టుకుంది.భావోద్వేగాలతో పాటు, విజయ్ తన మేనిఫెస్టోలో విద్య, వైద్యం, మరియు వ్యవసాయ రంగాలపై విప్లవాత్మకమైన హామీలు ఇచ్చారు. ముఖ్యంగా 33% మహిళా రిజర్వేషన్లు పార్టీ అభ్యర్థుల ఎంపికలో పాటించడం మహిళా ఓటర్ల మనసు గెలుచుకుంది.గెలవడం ఒక ఎత్తు అయితే, పాలించడం మరో ఎత్తు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విజయ్ ముందు ముళ్ళబాట కూడా ఉంది.విజయ్‌కు లేదా ఆయన పార్టీలోని మెజారిటీ అభ్యర్థులకు పాలనాపరమైన అనుభవం లేదు. బ్యూరాక్రసీని (అధికార యంత్రాంగాన్ని) ఎలా నడిపిస్తారనేది ప్రశ్నార్థకం.తమిళనాడు రాష్ట్రం ప్రస్తుతం భారీ అప్పుల్లో ఉంది. మేనిఫెస్టోలో ఇచ్చిన ఉచిత పథకాలు, అభివృద్ధి పనులకు నిధులు సమకూర్చడం ఒక సవాలు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తమిళనాడులో ఎప్పుడూ వ్యతిరేకత ఉంటుంది. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో గొడవ పడకుండానే నిధులు రాబట్టుకోవడం విజయ్ దౌత్య నీతికి పరీక్ష.టీవీకే అధినేత తన ప్రసంగాల్లో తమిళ నాడు మోడల్ కంటే మెరుగైన ప్రజాస్వామ్య పాలన ను అందిస్తానని వాగ్దానం చేశారు. ఆయన ప్రధానంగా దృష్టి సారించబోయే రంగాలు.విద్యా రంగం ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను పూర్తిగా మార్చడం, ప్రతి జిల్లాలో ఉచిత నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయడం విజయ్ ప్రధాన లక్ష్యం. అక్షరం అనేది ప్రతి బిడ్డ హక్కు, అది వ్యాపారం కాకూడదు అని ఆయన బలంగా నమ్ముతారు.వైద్య రంగం కేరళ తరహాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయడం, ప్రతి పేదవాడికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందేలా ఉచిత బీమా పథకాన్ని (ఆరోగ్యశ్రీ తరహాలో ) మరింత సరళీకృతం చేయడం. రైతులకు గిట్టుబాటు ధరతో పాటు, నేరుగా మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం. కావేరీ నీటి వివాదాల పరిష్కారానికి పక్కా ప్రణాళిక సిద్ధం చేయడం.ప్రముఖ రాజకీయ విశ్లేషకులు విజయ్ విజయాన్ని ఒక " క్లీన్ స్లేట్ " గా అభివర్ణిస్తున్నారు. ప్రజలు ఆయనపై ఎటువంటి మరకలు లేని నాయకుడిగా నమ్మకం ఉంచారు.విజయ్ గెలుపు కేవలం సినిమా క్రేజ్ వల్ల రాలేదు. డీఎంకే వైఫల్యాలు, ఏఐఏడీఎంకే బలహీనత మధ్య ప్రజలకు ఒక నిజాయితీ గల ప్రత్యామ్నాయం దొరికింది.విజయ్ తన కేబినెట్‌లో విద్యావంతులకు, యువతకు ప్రాధాన్యత ఇస్తానని ఇప్పటికే ప్రకటించారు. తమిళనాడు రాజకీయాల్లో 2026 ఒక మైలురాయి. జోసెఫ్ విజయ్ ఒక నటుడిగా ఎలాగైతే శిఖరాగ్రానికి చేరుకున్నారో, ఒక ప్రజా నాయకుడిగా కూడా అలాగే రాణిస్తారని కోట్లాది మంది ఆశిస్తున్నారు. సవాళ్లు ఎన్ని ఉన్నా, అంకితభావం ఉంటే మార్పు సాధ్యమేనని ఆయన నిరూపించారు.విజయ్ పాలన కేవలం తమిళనాడుకే పరిమితం కాకుండా, పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాజకీయాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఒక నటుడు రాజకీయాల్లోకి వచ్చి అద్భుతాలు చేయగలడని నిరూపించడానికి ఇప్పుడు వేదిక సిద్ధమైంది. విజయ్ అనే పేరు కేవలం సినిమా పేర్లకే పరిమితం కాకుండా, ఒక ఆదర్శవంతమైన ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోవాలని

# తనివి తీరలేదే...!

**జీవితమంటే ఏమిటి? ఈ ప్రశ్న మానవ నాగరికత ప్రారంభమైన నాటి నుండి నేటి వరకు మనల్ని వెంటాడుతూనే ఉంది. ఒక్కొక్కసారి ప్రశాంతంగా ఉన్న మనసు సముద్రపు లోతుల్లోకి వెళ్ళినట్టు ఈ ప్రశ్నలో మునిగిపోతుంది. ఎన్నెన్నో సందర్భాలలో, ఎన్నెన్నో రోజులలో మనం ఏదో ఒకటి పొందుతాం, అనుభవిస్తాం, ఆనందిస్తాం. ఒక లక్ష్యాన్ని చేరుకుంటాం, ఒక విజయాన్ని అందుకుంటాం. కానీ, ఆ క్షణం గడిచిన మరుక్షణమే మళ్ళీ ఏదో వెలితి. మళ్ళీ ఏదో కావాలనే తపన. ఈ కోరికకు అంతమే లేదు, ఈ తృష్ణకు తీరే లేదు. తనివి తీరలేదే అని గుండె లోలోపల ఒక నిరంతర ఆలాపన వినిపిస్తూనే ఉంటుంది. ఆ పాట ఎప్పుడూ ఆగదు, ఆ వెలితి ఎప్పుడూ తీరదు.**

నిజానికి, అదే ఈ మానవ జీవితపు అతి పెద్ద సత్యం మరియు అత్యంత సుందరమైన రహస్యం.ప్రకృతి ఒక అనంతమైన కావ్యం. వేకువ జామున ఆకాశం తూర్పు దిక్కున సిందూర రంగుల చీర కట్టుకొని, మంచు బిందువుల నగలు ధరించి నవ్వుతున్నట్లు ఉంటుంది. ఆ వెలుతురు తొలి కిరణం మబ్బుల చాటుగా, లజ్జతో కూడిన వధువులా తొంగిచూసే వేళ, మనసు ఒక వింత ఆనందంలో తేలిపోతుంది. ఆ దృశ్యాన్ని కళ్ళతో తాగుతాం, ఆ క్షణంలో మన ఉనికిని మనం మర్చిపోతాం. అయినా, మరుసటి రోజు ఉదయం మళ్ళీ అదే ఆకాశాన్ని, అదే సూర్యోదయాన్ని చూడాలని ఎదురుచూస్తాం. ఒక్కరోజు ఆ వెలుగు చూస్తే తనివి తీరదు వందేళ్ళు చూసినా ఆ తహతహ తీరదు. ఎందుకు ఈ దాహం? ప్రకృతి, ఈ భూమి, ఈ ఆకాశం ఇవన్నీ మనిషి హృదయపు ఆకలిని పెంచుతాయే తప్ప ఎన్నటికీ తీర్చవు.వర్షాకాలంలో భూమిపై పడే చినుకుల సంగీతం ఒక అద్భుతం. ఆ చప్పుడు చెవులకు అమృతంలా అనిపిస్తుంది. వాన చినుకు తాకిడికి పుడమి నుంచి ఉద్భవించే ఆ మట్టి వాసన ముక్కుకు ఒక పండగ. తడి మబ్బుల తెరల మధ్య నుండి ఆకస్మికంగా ప్రత్యక్షమయ్యే ఇంద్రధనుస్సు కంటిపాపల్ని రంగులతో నింపుతుంది. ఆ రంగుల విన్యాసం ఎంత చూసినా తనివి తీరదు. ఇంకొంచెం సేపు ఉంటే బాగుండు, ఇంకొంచెం రంగులీనితే బాగుండు అని మనసు అడుగుతూనే ఉంటుంది. ప్రకృతి మనిషికి అన్నీ ఇచ్చింది అపారమైన సంపదను, అందాన్ని, అనుభూతిని. అయినా ఆ ఇంకా కావాలి అనే భావన పోదు. అది లోభం కాదు, అది ప్రకృతితో మమేకం కావాలనే ఆత్మ తపన. అదే జీవితపు అందం, అదే మన ఉనికిలోని నిగూఢ రహస్యం.తనివి తీరని ఈ మనసే మనిషిని ముందుకు నడిపిస్తుంది. అది బాధ కాదు అది ఒక శక్తి. అది లేమి కాదు అది పరిపూర్ణత వైపు వెలిగే వెలుగు.మనం అక్షరాలను గుర్తుపట్టడం మొదలుపెట్టిన రోజు నుంచి ఒక కొత్త లోకం మన కోసం తలుపులు తెరుచుకుంటుంది. ఒక పుస్తకాన్ని చేతిలోకి తీసుకున్నప్పుడు, మనం కేవలం కాగితాలను కాక, వేల సంవత్సరాల మేధస్సును స్పృశిస్తాం. పుస్తకం చదివేటప్పుడు మనసు కాలం మరియు ప్రదేశాల సరిహద్దులను దాటి ఎంత దూరాలకు ప్రయాణం చేస్తుందో! కాళిదాసు కవిత్వంలోని శృంగార, కరుణ రసాల్లో తడిసిపోయేది ఒక్క క్షణం. తిక్కన భారతంలో యుద్ధ నీతిని, మానవ స్వభావ వర్ణనను చూసి ఆగిపోయేది మరొక్కసారి. విజ్ఞాన శాస్త్ర అద్భుతాలలో ఓలలాడేది మరొక చోట.అయినా ఆ జ్ఞానపిపాస ఏ మాత్రమూ తగ్గదు. ఒక పుస్తకం పూర్తయిందా? వెంటనే మరో పుస్తకం కోసం చేయి చాస్తుంది. ఒక సంక్లిష్టమైన విషయం అర్థమైందా? ఆ అవగాహన వెనుక మరో వంద రహస్యాల ద్వారాలు తెరుచుకుంటాయి. ఈ జ్ఞానపిపాసకు అంతమే లేదు అది ఉండకూడదు కూడా. మహాత్ములు, మేధావులు ఎప్పుడూ విద్యార్థులుగానే మిగిలిపోయారు. ఎందుకంటే, జ్ఞానమనేది ఒక అంతులేని మహాసముద్రం. అందులో ఎన్ని ముత్యాలు ఏరుకున్నా, ఇంకా లోపల ఏముందో చూడాలనే కుతూహలం చావదు.శాస్త్రవేత్తలు రాత్రీపగలూ ప్రయోగాలు చేస్తారు. ప్రకృతి రహస్యాలను ఛేదించడానికి తమ జీవితాలను ధారపోస్తారు. ఒక్కో చిక్కుముడి విడిపోయినప్పుడు వారు పొందే ఆనందం వర్ణనాతీతం. అయినా, ఆ విజయంతో వారు ఆగిపోరు. ఒక సమాధానం పది కొత్త ప్రశ్నలను పుట్టిస్తుంది. తత్వచింతకులు జీవిత సత్యాల కోసం నిరంతరం అన్వేషిస్తారు. సత్యం హస్తగతమైందని అనుకున్న వెంటనే, దాని వెనుక మరో సూక్ష్మమైన పొర కనిపిస్తుంది. ఈ నిరంతర అన్వేషణే మానవ జాతి గొప్పతనం. తనివి తీరలేదే...అన్న ఈ వెలితే మనిషిని గుహల నుండి అంతరిక్ష కేంద్రాల వరకు నడిపించిన చోదక శక్తి. ఒకవేళ మనిషికి తనివి తీరిపోయి ఉంటే, మానవ పరిణామం ఎప్పుడో ఆగిపోయేది.ప్రేమ గురించి మాట్లాడేటప్పుడు పదాలు వాటి అర్థాన్ని కోల్పోతాయి. ఆ అనుభూతిని వివరించడానికి భూమిపై ఉన్న ఏ భాషా సరిపోదు. ప్రేమించిన వ్యక్తిని ఎన్నిసార్లు చూసినా కళ్ళు తనివి తీరవు. ప్రతి రోజూ చూస్తున్నా, ప్రతి క్షణం చూస్తున్నా, మళ్ళీ ఆ రూపం కొత్తగానే కనిపిస్తుంది. ఆ మాటలు ఎన్నిసార్లు విన్నా చెవులకు విసుగు పుట్టదు. ఆ స్పర్శలో ఉండే వెచ్చదనం ఎన్నిసార్లు అనుభవించినా మనసు తనివి తీరదు. ప్రేమ ఒక అనంత సముద్రం అందులో ఈదినకొద్దీ లోతు పెరుగుతుంది తప్ప గట్టు కనిపించదు.అమ్మ ప్రేమను చూడండి ఆమె తన బిడ్డను ఎంత ప్రేమించినా, ఎన్ని త్యాగాలు చేసినా, ఇంకా ఏదో చేయాలని, ఇంకా ప్రేమించాలని ఆమె హృదయం తపిస్తూనే ఉంటుంది. ఆ ప్రేమకు తనివి తీరడం అన్న మాటకు తావు లేదు. తండ్రి తన పిల్లల భవిష్యత్తు కోసం జీవితమంతా శ్రమిస్తాడు. అయినా వృద్ధాప్యంలో కూడా నా పిల్లల కోసం ఇంకా ఏమి చేయగలను? అని ఆరాటపడతాడు. మిత్రులు ఒకరికొకరు ప్రాణప్రదంగా అండగా నిలబడతారు. ఈ ప్రేమ యొక్క తనివి తీరని స్వభావమే దాని శ్రేష్ఠతను చాటిచెబుతుంది. ఎక్కడైతే తనివి తీరుతుందో, అక్కడ ప్రేమ ఒక వ్యాపారంగా లేదా ఒక బాధ్యతగా మారిపోతుంది. నిజమైన ప్రేమ ఎప్పుడూ ఇంకా, ఇంకా అంటూనే ఉంటుంది. అది ఇచ్చే కొద్దీ పెరిగే సంపద.సంగీతం వింటున్నప్పుడు ఆత్మ ఈ భౌతిక ప్రపంచం నుండి విడివడి ఎక్కడో తేలిపోతుంది. ఒక శాస్త్రీయ సంగీతపు ఆలాపన లేదా ఒక మధురమైన జానపద గీతం చెవుల్లో పడినప్పుడు, మన లోపలి అంతరాత్మతో దానికి ఒక మర్మసంబంధం ఏర్పడుతుంది. ఆ స్వరాలు ఎంత వింటే అంత ఇంకా వినాలి అనిపిస్తుంది. ఒక పాట ముగియగానే, మనసులో కలిగే ఆ చిన్న నిశ్శబ్దం మనల్ని మళ్ళీ మరో పాట కోసం ప్రేరేపిస్తుంది. రాత్రంతా సంగీతంలో మునిగి తేలినా, తెల్లవారేసరికి ఇంకా వినాలనే తహతహ మనల్ని వదలదు.సాహిత్యం కూడా అంతే. శ్రీశ్రీ మహాప్రస్థానం చదివినప్పుడు రక్తం ఉడుకుతుంది, ఒళ్ళు గగుర్పొడుస్తుంది. వేమన పద్యం చదివినప్పుడు జీవిత సత్యం చెంపదెబ్బ కొట్టినట్లు తగులుతుంది. అయినా మరొక్కసారి, ఇంకొక్కసారి అని ఆ పుస్తకాలనే మళ్ళీ మళ్ళీ తిరగేస్తాం. కళ మనిషిని ఒక మధురమైన బందీగా మారుస్తుంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఆ బందీతనంలోనే మనిషికి అసలైన స్వేచ్ఛ అనుభవానికి వస్తుంది. కళాకారుడు తన కళాఖండాన్ని సృష్టించినప్పుడు, అది ఎంత అద్భుతంగా ఉన్నా, అతని లోపల ఇంకా మెరుగ్గా చేయాల్సింది అనే తపన మిగిలే ఉంటుంది. ఆ తనివి తీరని గుణమే గొప్ప కళాఖండాలకు జన్మనిస్తుంది.మనం ఒక్కసారి లోతుగా ఆలోచిస్తే అసలు తనివి తీరిన వ్యక్తి ఏమి చేస్తాడు? నేను అన్నీ సాధించాను, అన్నీ పొందాను, ప్రపంచంలో నాకు తెలియనిది ఏదీ లేదు, ఇంకా ఏమీ వద్దు అని తృప్తిపడిపోయిన వ్యక్తి ఇక కదలలేడు. అతను కొత్త సాహిత్యాన్ని సృష్టించడు, కొత్త విజ్ఞానాన్ని వెదకడు, కొత్త బంధాలను వెతుక్కోడు. ఈ తనివి తీరలేదే అనే వ్యాకులతే మనిషిని చైతన్యవంతుడిగా ఉంచుతుంది. మనలోని అతృప్తే సమస్త సృజనకూ మూలం.ప్రాచీన తత్వవేత్తలు ఈ తనివి తీరని దాహాన్ని ముముక్షుత్వం అని పిలిచారు అంటే విముక్తి కోసం లేదా సత్యం కోసం చేసే నిరంతర వెదుకులాట. ఆ వెదుకులాటే మానవుని ఆత్మను ఎప్పటికీ జీవంతంగా ఉంచుతుంది. బుద్ధుడు రాజభోగాలను వదిలి జ్ఞానాన్ని వెదికాడు. అల్లమప్రభు తన వచనాల ద్వారా భక్తి మార్గంలో మునిగిపోయాడు. విశ్వనాథ సత్యనారాయణ తన కవిత్వంలో ఆత్మ దర్శనం చేసుకున్నారు. వీరందరికీ ఒక లక్ష్యం ఉంది అయినా ఆ లక్ష్యాన్ని అందుకున్నాక వారు ఆగిపోలేదు. ఎందుకంటే వారిలోని సత్యాన్వేషికి తనివి తీరలేదు. అది తీరకూడదు కూడా.ఈ జగత్తులో జన్మించిన ప్రతి మనిషీ ఏదో ఒకటి వెదుకుతున్నాడు. ఒకరు ఆకలి తీర్చుకోవడానికి అన్నం వెదుకుతున్నారు, ఒకరు భద్రత కోసం ధనం వెదుకుతున్నారు, మరికొందరు ఆత్మీయత కోసం ప్రేమను, శాంతి కోసం ముక్తిని వెదుకుతున్నారు. ఈ వెదుకులాటలోనే జీవితం గడిచిపోతుంది. చివరకు మనం అనుకున్నది దొరుకుతుందా లేదా అన్నది ముఖ్యం కాదు, ఆ ప్రయాణంలో మనం పొందే అనుభవాలే ముఖ్యం. తనివి తీరలేదే అంటూ సాగే ఈ అసంపూర్ణ ప్రయాణమే మానవ జన్మకు ఒక పరిపూర్ణ అర్థాన్ని ఇస్తుంది.తనివి తీరిన క్షణమే జీవితపు ప్రయాణం ఆగిపోతుంది. ఆ ఆగిపోవడమే మరణం. తనివి తీరకపోవడమే నిజమైన జీవించడం.కాబట్టి, ఓ ప్రియమైన పాఠకుడా నీ మనసులోని ఆ ఇంకా కావాలి అనే అన్వేషణను చూసి భయపడకు. అది లోభం అని భావించి సిగ్గుపడకు. ఆ వెలితే నీలోని జీవశక్తి. ఆ అతృప్తే నీ రేపటి విజయానికి ప్రేరణ. ఆ దాహమే నిన్ను సమాజంలో ఒక ప్రత్యేక వ్యక్తిగా నిలబెడుతుంది. ఆ తనివి తీరలేదే.. అనే నిట్టూర్పులో, ఆ చిన్న వెలితిలో జీవితపు మొత్తం సంగీతం దాగి ఉంది. దాన్ని విను, ఆ అనుభూతిని హృదయానికి హత్తుకో, ప్రతి క్షణాన్ని నిండుగా జీవించు. ఎందుకంటే, తనివి తీరని జీవితమే అత్యంత విలువైనది.చదివినా, వినినా, ప్రేమించినా తనివి తీరదు అదే జీవితపు దైవత్వం, అదే మనిషి ఉనికికి సార్థకత.



**ఆ స్పర్శలో ఉండే వెచ్చదనం ఎన్నిసార్లు అనుభవించినా మనసు తనివి తీరదు. ప్రేమ ఒక అనంత సముద్రం అందులో ఈదినకొద్దీ లోతు పెరుగుతుంది తప్ప గట్టు కనిపించదు.అమ్మ ప్రేమను చూడండి ఆమె తన బిడ్డను ఎంత ప్రేమించినా, ఎన్ని త్యాగాలు చేసినా, ఇంకా ఏదో చేయాలని, ఇంకా ప్రేమించాలని ఆమె హృదయం తపిస్తూనే ఉంటుంది. ఆ ప్రేమకు తనివి తీరడం అన్న మాటకు తావు లేదు.**




డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169


# పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు

**తొలి మూడు ఫలితాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రశంస**

**ఒక్కొక్కరికి 5వేల చొప్పున నగదు అందించిన గద్దె దంపతులు**

విజయవాడ:పదో తరగతిలో ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, అనురాధ దంపతులు సత్కరించారు. నలభై మంది విద్యార్థులను సత్కరించి, ఒక్కొక్కరికి 5 వేల రూపాయల చొప్పున రెండు లక్షల రూపాయల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర భవిష్యత్తు, సంపద యువతే అని కూటమి ప్రభుత్వం బలంగా నమ్ముతోందన్నారు. మంత్రి లోకేశ్ తన విద్య అనుభవాన్ని ఉపయోగించి 100 రోజుల కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ మార్కులతో విజయం సాధించారని కొనియాడారు. రౌడీయిజం, మాఫియా, హింస ఉన్న ప్రాంతాలు, దేశాలు సర్వనాశనం అవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. రప్పా రప్పా అంటూ యువత జీవితాలని నాశనం చేసే పార్టీకి శాశ్వతంగా చరమగీతం పాడాలన్నారు. అటువంటి వాతావరణానికి దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గత ఐదేళ్లలో జరిగిన నష్టాన్ని గమనించిన ప్రజలు, తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలని కోరుకుంటూ కూటమి అభ్యర్థులకు భారీ మెజారిటీని అందించారన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలన్నది సీఎం చంద్రబాబు సంకల్పమని స్పష్టం చేశారు. రాజధాని అమరావతి నిర్మాణం అనేది కేవలం వ్యక్తి కోసం కాదని.. అది రాబోయే తరాల పిల్లల భవిష్యత్తు కోసమని అందరూ గుర్తుంచుకోవాలని తెలిపారు.యువతకు ఉజ్వల భవిష్యత్తును అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గద్దె రామ్మోహన్ స్పష్టం చేశారు. అమరావతి నగరం ఆంధ్ర రాష్ట్రం మొత్తానికి ఉపాధి కల్పించే నగరంగా మారబోతోందన్నారు. కూటమి ప్రభుత్వం తన అజెండాలో భాగంగా 20 లక్షల ఉద్యోగాల కల్పనను లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఇప్పటికే అనేకమందికి ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. రాజకీయ సిఫార్సులు, లంచాలకు తావులేకుండా, ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ ఆధారంగానే టీచర్లను ఎంపిక చేస్తున్నారని తెలిపారు. బదిలీల విషయంలో కూడా ఇదే విధమైన పారదర్శక విధానాన్ని ప్రభుత్వం అనుసరిస్తుందని చెప్పారు.

# హత్నూరలో పారిశుద్ధ కార్మికులపై తేనెటీగల దాడి

## ప్రాణాల మీదకు వచ్చిన విధులు.. పట్టించుకోని పంచాయతీ కార్యదర్శిపై గ్రామస్తుల ఆగ్రహం

**హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మే 11:** సోమవారం హత్నూర మండల కేంద్రంలోని వాటర్ ట్యాంకు వద్ద పైపులైన్ లీకేజీ మరమ్మత్తులు చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులపై ఒక్కసారిగా తేనెటీగలు మూకుమ్మడిగా దాడి చేయడంతో తీవ్ర కలకలం రేగింది. విధి నిర్వహణలో నిమగ్నమైన కార్మికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీసిన ఘటన స్థానికంగా ఆందోళన కలిగించింది. తేనెటీగల దాడితో కార్మికులు కేకలు వేస్తూ అక్కడి నుంచి తప్పించుకునేందుకు యత్నించగా, పలువురు తీవ్రంగా గాయపడి అస్వస్థతకు గురయ్యారు. ఘటనను గమనించిన సర్పంచ్ ఎల్లయ్య, స్థానిక నాయకులు, గ్రామస్తులు వెంటనే స్పందించి గాయపడిన కార్మికులను హత్నూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. అయితే ఘటన జరిగిన సమయంలో గ్రామపంచాయతీ కార్యదర్శి



మజార్ కనీసం సంఘటన స్థలానికి రాకపోవడం, కార్మికుల పరిస్థితిని పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. "ప్రమాదంలో కార్మికులు ప్రాణాలతో పోరాడుతుంటే అధికారులు ఎక్కడున్నారు?" అంటూ గ్రామస్తులు మండిపడ్డారు. రోజూ ప్రజల కోసం ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల భద్రతపై అధికారుల నిర్లక్ష్యం బయటపడిందని స్థానికులు ఆరోపించారు. వెంటనే కార్మికులకు రక్షణ చర్యలు, భద్రతా పరికరాలు కల్పించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# ఇండ్ల గణన కార్యక్రమానికి ప్రజలంతా సహకరించాలి: జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**జన గణన 2027లో భాగంగా మే 11 నుండి జూన్ 9 వరకు తొలి దశ "ఇండ్ల గణన" నిర్వహణ**

**ప్రతి ఇంటికి ఎన్యుమరేటర్లు వచ్చి కుటుంబ వివరాలు సేకరణ**

**ప్రజలు అందించే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుంది**

**ప్రభుత్వ పథకాలు కోల్పోతామనే అపోహలు అవసరం లేదు**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** జన గణన -- 2027 లో భాగంగా తొలి దశ ప్రక్రియ అయిన "ఇండ్ల గణన" కార్యక్రమం జిల్లాలో మే 11 నుండి జూన్ 9 వరకు నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఎన్యుమరేటర్లు ప్రతి గృహానికి వచ్చి కుటుంబ వివరాలను సేకరిస్తారని తెలిపారు. ప్రజలు పూర్తి సరైన సమాచారాన్ని అందించి ఇండ్ల గణన కార్యక్రమానికి సహకరించాలని కోరారు. ఇప్పటికే పొందుతున్న ప్రభుత్వ పథకాలు కోల్పోతామనే అపోహలు అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు తెలియజేసే వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. సేకరించిన సమాచారం భారత దేశ భవిష్యత్ ప్రణాళికలు రూపొందించడానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కావున జిల్లా ప్రజలందరూ తమ ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్లకు సరైన సమాచారాన్ని అందించి ఇండ్ల గణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.



# ఉపాధి హామీ చట్ట రక్షణ కోసం ఈ నెల 15న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రామీణ సమ్మెకు సహకరించండి

### తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం

**భువనగిరి, మే 11(క్రైమ్ మిర్రర్):** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన విబి - జి రాంజీ చట్టాన్ని రద్దుచేసి పాత చట్టాన్ని కొనసాగించాలని, ఉపాధి హామీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మే 15న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రామీణ సమ్మె (బంద్) కార్యక్రమానికి సహకరించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి టి. నాగిరెడ్డికి తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో "సమ్మె" నోటీసును సంఘం జిల్లా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శి బొల్లు యాదగిరి, కొండమడుగు నర్సింహ, జిల్లా ఉపాధ్యక్షులు, చీమల కొండూరు సర్పంచ్ పల్లెర్ల అంజయ్య లు అందించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ సంపదలో కీలక పాత్ర పోషిస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్న ఉపాధి హామీ కార్మికులు మోడీ తీసుకొచ్చిన జిరాంజి చట్టం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన




వెలిబుచ్చారు. కొత్త కొత్త జీవోలతో గత చట్టంలో ఉన్న అనేక హక్కులను కూడా తొలగించారని అన్నారు. ఉపాధి కార్మికుల సమస్యలు అన్ని ఇన్ని కావని పనికి పోతే ఎంత కూలి వస్తుందో కూడా తెలియని పరిస్థితిలో ఉన్నారని, చేసిన పనికి ఎప్పుడు డబ్బులు వస్తాయో కూడా తెలియక తమ కుటుంబాల పోషణ భారంగా మారిందని అన్నారు. ఇప్పటికైనా ఉపాధి హామీలో పనిచేస్తున్న కార్మికులతో పాటు సిబ్బందికి సంబంధించిన పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఉపాధి హామీలో పనిచేస్తున్న కార్మికులకు సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించి రోజు కూలీ 800 ఇవ్వాలని, రోజుకు రెండుసార్లు ఫోటోలు తీసి ఈ- కేవైసీ విధానాన్ని రద్దుచేయాలని, పని ప్రదేశంలో తాగడానికి మంచి నీళ్లు, నీడ కోసము టెంటు, మెడికల్ కిట్టు లాంటి సౌకర్యాలు కల్పించాలని, విబి - జి రాంజీ చట్టాన్ని రద్దుచేసి , పాత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, పని ప్రదేశంలో ప్రమాదాలు జరిగితే ఉచిత వైద్యం అందించాలని, కార్మికులందరికి బీమా సౌకర్యం కల్పించాలని, కూలీలకు పారా, తట్ట, గడ్డపార, గొడ్డలి వంటి పనిముట్లు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వము 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వము 40 శాతం నిధులు ఇవ్వాలని తెచ్చిన జీవోలు రద్దుచేసి కేంద్ర ప్రభుత్వమే 90% నిధులు కేటాయించాలని, పట్టణాల్లో కూడా ఉపాధి హామీ పనులను కల్పించి పేదలకు ఉపాధి కల్పించాలనే డిమాండ్స్ సాధన కోసం ఈ నెల 15న నిర్వహిస్తున్న గ్రామీణ సమ్మెలో ఉపాధి హామీ కార్మికులు లక్షలాదిగా పని బంద్ చేసి పాల్గొనాలని వారు కోరారు.




# సంస్థాన్ లో ఘనంగా ఎస్ఎస్సి 2000-2001 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన వేడుకలు

**రజతోత్సవ వేడుకల్లో ఆనందోత్సవాల మధ్య పాల్గొన్న పూర్వ విద్యార్థులు**

**కార్యక్రమంలో పాల్గొన్న ఆనాటి ఉపాధ్యాయులు, సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి**

**సంస్థాన్ నారాయణపురం, మే 11(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో పదవ తరగతి 2000-2001 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం నుండి పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమం ఆనాటి జ్ఞాపకాలతో మొదలై నేటి జ్ఞాపకాలతో ముగిసింది. విద్యార్థులు తాము పదవ తరగతిలో ఎలా ఉండేవారము అని ఉపాధ్యాయుల ముందు గుర్తు చేసుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మిత్రులందరు కలిసేందుకు కృషి చేసిన రజితోత్సవ వేడుకల ఆర్గనైజింగ్ కమిటీని స్నేహితులు అందరు అభినందించారు. అనంతరం అందరూ డాన్సులు చేసి వారి ఆనందాన్ని అందరితో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, ఎస్ఎస్సి 2000-2001 బ్యాచ్ పూర్వ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనల ఉల్లంఘన పై చట్టపరమైన చర్యలు తీసుకోండి...: పీసీసీ కార్యదర్శి సామల్ కార్తీక్...

**శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ :** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ప్రధాన కూడలిలో, కాలనీలోని రోడ్డు, ఇల్లు గోడలు ఇలా ప్రభుత్వం, ప్రైవేట్ అనే తేడా లేకుండా విపరీతమైన రీతిలో ఇష్ట రీతిగా వెలిసిన ఫ్లెక్సీ, వాల్ పోస్టర్, వాల్ రైటింగ్ వంటి చట్ట నిబంధనలను ఉల్లంఘించిన అంశాలు పై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ కు ఫిర్యాదు చేసిన టీపీసీసీ కార్యదర్శి సామల్ కార్తీక్.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫ్లైఓవర్ లు, కాలనీ, పార్క్, కూడలిలా సుందరీకరణ పనులు చుట్టశుద్ధిగా కోట్ల రూపాయలు వెచ్చించి పనులు చేపట్టిందని అన్నారు. ఒక పక్క నిర్మిస్తుంటే మరో పక్క నుంచి పాడుచేస్తూ రావడం శోచనీయం అని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించి నిర్మూలన చర్యలు చేపట్టాలని కోరారు. జి.ఓ కాపీని జతచేస్తూ అవసరమైన చోట జరిమానాలు విధించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు కూడా ప్రభుత్వం చేసిన సుందరీకరణ పనులను కాపాడడంలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అజామ్, నాగరాజు, ఎన్ ఎస్ యు ఐ,మౌళి పాల్గొన్నారు.






# ఉపాధి హామీ కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసిన సర్పంచ్ యతీశ్వర్ గౌడ్

**ఆత్మకూరు(ఎం),మే11/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం రాఘవాపురం గ్రామం సోమవారం రోజున గ్రామంలో ఉపాధిహామీ పనిచేసే ప్రదేశానికి వెళ్లి ఉపాధి హామీ కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేసిన సర్పంచ్ ఎరుకల యతీశ్వర్ గౌడ్. అనంతరం వారు ఉపాధి హామీ కార్మికులతో మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా ఎండలు ఎక్కువగా ఉన్నందున పనికి ఉదయమే వచ్చి త్వరగా పనులు చేసి త్వరగా వెళ్ళాలని అన్నారు.వడదెబ్బకు ఎవ్వరు గురికాకుండా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ బాకీ పద్మశ్రీ,ఫీల్డ్ అసిస్టెంట్ కొంపల్లి ఇస్తారి,ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.


# జనగణన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :** బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలో ప్రారంభమైన జనగణన కార్యక్రమాన్ని జోనల్ కమిషనర్ చంద్రకళ మరియు డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య ప్రత్యక్షంగా పరిశీలించారు. ఫీల్డ్‌లో ఇంటింటికి వెళ్లి జనగణన విధులు నిర్వహిస్తున్న సూపర్వైజర్లు మరియు ఎన్యుమరేటర్ల పనితీరును పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య మాట్లాడుతూ, ప్రతి ఇంటికి వెళ్లి ఖచ్చితమైన కుటుంబ వివరాలు సేకరించాలని, ప్రజలకు జనగణన ప్రాముఖ్యతను వివరించాలని అధికారులకు సూచించారు. జనగణన ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు.


క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు కంటెంట్ రైటర్లు కావలెను

సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి...**

**ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మౌలిక వసతులను కల్పించాలి...**

**ఉద్యోగుల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలి...**

**యాదాద్రి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



**యాదాద్రి జిల్లా, మే 11, క్రైమ్ మిర్రర్ :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 75 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. సోమవారం ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులలో రెవిన్యూ శాఖ 47,జిల్లా పంచాయతీ 8, పంచాయతీరాజ్ 3, ఎస్సీ డెవలప్మెంట్ 3, గ్రామీణ అభివృద్ధి శాఖ 2, విద్యాశాఖ 2, ఉపాధి కల్పన 2, మున్సిపాలిటీ 2 హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ , సర్వే ల్యాండ్స్, మైన్స్, ఫిషరీస్, వ్యవసాయ ,జిల్లా సంక్షేమ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షిస్తూ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలని, కొన్ని శాఖలు ఉద్యోగుల వివరాలు అందేజెయలేదని, అట్టి శాఖల ఉద్యోగుల వివరాలను అందజేయాలన్నారు. తదుపరి జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని , ట్యాబ్ ఎంట్రీలు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. రైతులకు ఏ ఇబ్బంది కలగకుండా దాన్యం కొనుగోలు సజావుగా జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు త్రాగు నీరు, టెంట్ తదితర మౌలిక వసతులు కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ జయమ్మ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి

**ఆత్మకూరు(ఎం),మే11/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పల్లెర్ల గ్రామ శాఖ సమావేశం తండ స్వామి అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ పల్లెర్ల గ్రామంలో గతంలో కొంత మందికి మాత్రమే ఇందిరమ్మ ఇల్లు ఇచ్చారు.ఇంకా అర్హులైన లబ్ధిదారులు నిరుపేదలున్నారు. అదేవిధంగా ఈ ఆత్మకూరు(ఎం) మండలంలో చాలా గ్రామాలలో అర్హులైన వారు ఉన్నారు. వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలన్నారు.వృద్ధాప్యా, వితశీత్తు,వికలాంగుల పెన్షన్ అర్హులైన వారికి ఇవ్వాలన్నారు .ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, సిపిఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేష్, మండల కార్యవర్గ సభ్యులు సోలిపురం లింగారెడ్డి,గుర్రం రాజమణి, శాఖ కార్యదర్శి దుర్గాపతి నరసింహ,సహాయ కార్యదర్శి కంబాలపల్లి కిష్టయ్య, వార్డ్ మెంబర్ అంబోజు రాములు, ఏనుగు శ్రీను రెడ్డి, బత్తిని లింగయ్య,బండి గోపాల్, కనబోయిన ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పీఎం జిపఉపాలో సమ్మర్ క్యాంప్ ప్రారంభం



**ఆత్మకూరు(ఎం),మే11/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రం లోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును స్థానిక సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.మహాదేవ రెడ్డి(ఎంఈఓ) ప్రారంభించడం జరిగినది. సర్పంచ్ బీసు ధనలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు సమ్మర్ క్యాంపు వలన తమ సృజనాత్మకతను పెంపొందించుకోవడానికి ఈ క్యాంపు ఉపయోగపడుతున్నదని అందరూ ఉపయోగించుకోవాలని కోరినారు.ఈ క్యాంపు మే నెలలో 11 వ తేదీ నుండి 25 మే వరకు ఉదయం 8:00 గం.ల నుండి మధ్యాహ్నం 12:00 గం.ల వరకు ఉంటుంది. ఈ క్యాంపులో,యోగ, ఆటలు,డ్రాయింగ్,స్పోకెన్ ఇంగ్లీష్,తదితర అంశాలు నేర్చుకోవటానికి వీలుంటుంది అని ప్రతి రోజు విద్యార్థులకు స్నాక్స్ అందించటం జరుగుతున్నది.ఇట్టి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసు కావాలని ప్రధానోపాధ్యాయులు (ఎంఈఓ) కె.మహా దేవ రెడ్డి విద్యార్థులను కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మజ్జిగ నరేష్,వార్డు సభ్యులు, ఉపాధ్యాయలు మక్బుద్ అలీ, మధు సూదన్ ఇందిరా ప్రియ,ఎస్యెంఎం అధ్యక్షులు మురళి కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ నేతల కుటుంబాలకు ఒక చట్టం.. సామాన్య ప్రజలకు మరో చట్టమా?

### బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సుర్వి యాదయ్య గౌడ్




**సంస్థాన్ నారాయణపురం, మే 11(క్రైమ్ మిర్రర్):** మోడీ, రేవంత్ రెడ్డి మౌనం వెనుక అసలు ఒప్పందం ఏమిటి? కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడి పై పోక్సో కేసు నమోదు అయినప్పటికీ ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడం రేవంత్ బండి ల మధ్య ఉన్న చీకటి స్నేహానికి నిదర్శనమని అనిపిస్తుంది."బేటీ బచావో, బేటీ పడావో" అంటూ దేశానికి నీతులు చెప్పే ప్రధాని నరేంద్రమోడీ ఇప్పుడు తన పార్టీ కీలక నేత కుటుంబానికి సంబంధించిన తీవ్రమైన కేసులో ఎందుకు మౌనం వహిస్తున్నారో దేశ ప్రజలకు సమాధానం చెప్పాలి.పోక్సో చట్టం కింద కేసు నమోదై 48 గంటలు దాటినా నిందితుడిని అరెస్ట్ చేయకపోవడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయన్నది నిజం కాదా? సామాన్యులు ఇదే నేరం చేస్తే పోలీసులు ఇదే విధంగా వ్యవహరించేవారా? బీజేపీ నాయకుల పిల్లలకు ప్రత్యేక రక్షణ, సామాన్య ప్రజలకు కఠిన చట్టాలా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఇక రాష్ట్ర ముఖ్యమంత్రి, బండి సంజయ్ ఆప్త మిత్రుడు రేవంత్ రెడ్డి ఈ ఘటనపై నోరు మెదపకపోవడం మరింత అనుమానాలకు తావిస్తోంది. తెలంగాణలో మహిళల భద్రతపై గొప్పలు చెప్పే కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు బీజేపీ సమాధానం చెప్పాలి.

## జనగణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి



**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**

**యాదాద్రి జిల్లా,మే 11, క్రైమ్ మిర్రర్ :** జనగణన--2027 తొలి దశలో భాగంగా నిర్వహిస్తున్న ఇండ్ల గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధికారులకు సూచించారు. సోమవారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న హౌస్ లిస్టింగ్ గణన ప్రక్రియను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. హౌస్ లిస్టింగ్ ఆపరేషన్‌లో ప్రతి ఇంటిని తప్పనిసరిగా కవర్ చేయాలని పేర్కొన్నారు. ఏ ఒక్క కుటుంబం లేదా గృహం గణనలో వదలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఎన్నుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు.ప్రతి ఎన్యూమరేటర్ తనకు కేటాయించిన పరిధిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ అవసరమైన సమాచారాన్ని సేకరించాలని సూచించారు. గణనలో నమోదు చేసే వివరాలు భవిష్యత్తు ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు.అధికారులు సమన్వయంతో పనిచేసి గణన ప్రక్రియను సమయానికి పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ఎస్ఎన్‌డీపీ నాలా పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గంలోని జిహెచ్ఎంసి జిల్లేలగూడ డివిజన్ పరిధిలోని మిథుల నగర్‌లో అసంపూర్తిగా నిలిచిపోయిన ఎస్ఎన్‌డీపీ నాలా పనులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి, రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నాలా పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఎక్కడా అలసత్వం ప్రదర్శించకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అర్కల భూపాల్ రెడ్డి, దిప్లాల్ చౌహాన్, అర్కల కామేష్ రెడ్డి, మదారి రమేష్, అనిల్ కుమార్ యాదవ్, విజయ్, దిండు భూపేష్ గౌడ్, లక్ష్మణ్ ముదిరాజ్, గోపి యాదవ్, సునీత బాలరాజ్, సుర్వి లత, పంతంగి మాధవి, బిందు, నిర్మల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎంజీఎన్ఆర్ఇజిఎస్ నిధులతో రహదారి పనులకు శంకుస్థాపన చేసిన సర్పంచ్ సుర్వి సౌజన్య రాజు గౌడ్

**సంస్థాన్ నారాయణపురం, మే 11(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల అల్లందేవిచెరువు గ్రామంలో ఎంజీఎన్ఆర్ఇజిఎస్ ఉపాధి హామీ పథకం కింద అంతటి వారి దొడ్ల నుండి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ సుర్వి సౌజన్య రాజు గౌడ్ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు.గ్రామ రైతులకు సౌకర్యవంతమైన రవాణా సదుపాయం కల్పించేందుకు ఈ రహదారి ఎంతో ఉపయోగపడుతుందని సర్పంచ్ గారు తెలిపారు. వర్షాకాలంలో గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ప్రతి వాడకు మౌలిక వసతులు అందించేందుకు గ్రామపంచాయతీ పాలకవర్గం కృషి చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ టీఏ మల్లయ్య,ఉపసర్పంచ్ ముఖ్యర్ల కవిత స్వామి యాదవ్,వార్డు సభ్యులు వంటల సువర్ణ గణేష్ యాదవ్, అంతటి శివశంకర్ గౌడ్, సిబ్బంది అంతటి నాగరాజు, ఏర్పుల నగేష్, గ్రామ ప్రజలు ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.



## పొంగిపొర్లుతున్న డ్రైనేజ్‌తో బీరంగూడ వాసుల అవస్థలు

**20 రోజులుగా కాలనీలో దుర్వాసన.. పట్టించుకోని అధికారులు**

**శాశ్వత పరిష్కారం చూపించాలని స్థానికుల డిమాండ్**



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మే 11:** అమీన్పూర్ జీహెచ్ఎంసీ పరిధిలోని బీరంగూడ 22వ వార్డులో డ్రైనేజ్ సమస్య తీవ్రరూపం దాల్చింది. గత 20 రోజులుగా డ్రైనేజ్ నీరు పొంగిపొర్లుతూ కాలనీ రోడ్లపై ఏరులై పారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినా "చూస్తాం.. చేస్తాం" అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదని మండిపడుతున్నారు. డ్రైనేజ్ నీరు రోడ్లపై నిల్వ ఉండటంతో మొత్తం కాలనీలో భరించలేని దుర్వాసన వ్యాపించిందని, ఇళ్లలో ఉండడమే కష్టంగా మారిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వర్షం పడిన సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని చెబుతున్నారు. డ్రైనేజ్ నీరు ఇళ్ల ముందుకు చేరడంతో చిన్నారులు బయట ఆడుకోలేని పరిస్థితి ఏర్పడిందని, వృద్ధులు మరియు అనారోగ్యంతో బాధపడుతున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాలనీవాసులు తెలిపారు. బీరంగూడ 22వ వార్డులోని ముదిరాజ్ బస్తి ప్రాంతంలో పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని స్థానికులు పేర్కొన్నారు. రోడ్లపై మురుగు నీరు నిలిచిపోవడంతో నడిచే వారికి కూడా ఇబ్బందిగా మారిందని, దోమలు విపరీతంగా పెరిగి అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు డ్రైనేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.స్థానిక ప్రజాప్రతినిధులు కూడా సమస్యను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించిన కాలనీవాసులు, ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారిన ఈ సమస్యపై వెంటనే చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.


క్రైమ్ మిర్రర్

**విలేకరులు కావలెను**

క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రంగారెడ్డి జిల్లా, మండలవారీగా, షాద్నగర్ , కేశంపేట, కడ్తాల్, కందుకూరు, కొత్తూరు, తలకొండపల్లి అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆతక్తిగలవారు ఈక్రింది నెంబరుకు సంప్రదించగలరు.

Email ID: crimemirrorts@gmail.com

9393 44 6188

## బండి సంజయ్ కుమారుడు భగీరథను, బిజెపి నాయకుడు సంఘపను
# అరెస్టు చేసి అమ్మాయికి తగిన న్యాయం చేయాలి

### బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ ..బిఆర్ఎస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి



**రాజపేట, మే 11(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండల కేంద్రంలో పత్రికా సమావేశం మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, మండల మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది. పత్రికా సమావేశంలో మండల మహిళా అధ్యక్షురాలు మాట్లాడుతూ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథను వెంటనే అరెస్టు చేయాలని వి6 మాజీ రిపోర్టర్ ప్రస్తుత బీజేపీ నాయకులు సంఘపను కుడా అరెస్టు చేసి అమ్మాయికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేయడం జరిగినది. బండి సంజయ్ రోజు ధర్మం న్యాయం కోసం గొంతు చించుకొని మాట్లాడుతారు కదా బాలిక విషయంలో మీ ధర్మం ఎటు పోయింది మీరు ధర్మం వైపు నిలబడతారా లేక అధర్మం వైపు నిలబడతారా అనీ దేశ ప్రజలందరూ వేచి చూస్తున్నారు.దేశంలో మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత నీపై లేదా. ఈ వ్యవహారంపై రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నోరు మెదపకపోవడంపై ఆశ్చర్యం వేస్తా ఉంది. తెల్లారి లేస్తే కేసీఆర్ ఫ్యామిలీ గురించి మాట్లాడే కాంగ్రెస్ నాయకులారా బండి సంజయ్ కుమారుడు చేసిన ఈ బాగోతం మీ కంటికి కనిపిస్తలేదా మీరు ఎందుకు మాట్లాడలేకపోతున్నారు. వెంబడే బండి సంజయ్ మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని రాజపేట మండలం నుంచి టిఆర్ఎస్ నాయకులుగా మేము డిమాండ్ చేస్తా ఉన్నాం. ఈ కార్యక్రమంలో జలపాల సాధకులు జస్వంత్, మదర్ డైరీ డైరెక్టర్ సంధిల భాస్కర్ గౌడ్, బెడిద వీరేశం మర్ల నాగరాజ బొంగోని ఉప్పలయ్య గౌడ్ దగ్గుల విష్ణు అంకతి నరసయ్య గంధమల సురేష్ తదితరులు పాల్గొన్నారు

## మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు
### వెల్దండ ఎస్సై యుగంధర్ రెడ్డి



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (వెల్దండ):** ట్రాఫిక్ రూల్స్ ను అతిక్రమించి మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వెల్దండ ఎస్సై యుగంధర్ రెడ్డి హెచ్చరించారు. వెల్దండ పోలీస్ స్టేషన్ ఎదురుగా హైదరాబాద్- శ్రీశైలం ప్రధాన రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా కల్వకుర్తి మండలం కురుమిద్ద గ్రామానికి చెందిన వరకాల భాస్కర్ అనే వ్యక్తి మద్యం సేవించి వాహనము నడుపుతూ రాగా అతన్ని ఆపి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేయగా మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు తేలింది. ఆ వ్యక్తిని సోమవారం కల్వకుర్తి కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జ్ శ్రీనిధి అతనికి రెండు రోజులు సాధారణ జైలు శిక్ష విధించినట్లు ఎస్సై యుగంధర్ రెడ్డి పేర్కొన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త పడాలని ఎస్సై సూచించారు.

## టీజీ ఐసెట్ 2026 కు సర్వం సిద్ధం: కన్వీనర్ ఆచార్య అల్వాల రవి



**క్రైమ్ మిర్రర్, నల్లగొండ బ్యూరో:** ఎంబీఏ, ఎంసీఏ కోర్సులలో అడ్మిషన్ కోసం నిర్వహించే ఐసెట్ 2026ను రెండవ పర్యాయం మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం నిర్వహించనున్నట్లు కన్వీనర్ ఆచార్య అల్వాల రవి తెలిపారు. మే 13, 14వ తారీకుల్లో మూడు విడతల్లో నిర్వహించనున్న టీజీ ఐసెట్ కు 56223 మంది విద్యార్థుల్లో 30308 మంది మహిళలు, 25915 మంది పురుషులు, దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

**మే 13, 14 తేదీల్లో పరీక్షలు**

మే 13న మొదటి స్పెషల్ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు, రెండవ స్పెషన్ మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5:00 వరకు, 14 మే మొదటి సెషన్ ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12:30 వరకు నిర్వహించను న్నారు. దివ్యాంగులు మరియు ఉర్దూ విద్యార్థులకు మే 13 మధ్యాహ్నం 2వ సెషన్లో పరీక్ష నిర్వహించనున్నారు.

**69 కేంద్రాలలో పరీక్షల నిర్వహణ**

పరీక్ష మొత్తం తెలంగాణ వ్యాప్తంగా 16 రీజినల్ సెంటర్లలో, 69 పరీక్షా కేంద్రాలలో నిర్వహించనున్నట్లు 100 పరిశీలకులతో పారదర్శకంగా నిర్వహించనున్నట్లు చేసినట్లు ఆయన తెలిపారు. మొదటి సెషన్ విద్యార్థులు ఉదయం 8:30 నుండి, రెండవ సెషన్ ఒకటిన్నర నుండి పరీక్ష హాలులోకి అనుమతిస్తారు, మొదటి సెషన్ విద్యార్థులు 9:45 నిమిషాల తర్వాత , రెండవ సెషన్ విద్యార్థులకు 1:45 నిమిషాల తర్వాత ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరని వెల్లడించారు.

**పరీక్షల కోసం పకడ్బందీ ఏర్పాటు**

పరీక్షా నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని ఆచార్య అల్వాల రవి తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళన లేకుండా పరీక్షలకు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించాలని ఆయన సూచించారు. ఈసారి ఐసెట్ పరీక్షలను మరింత కట్టుదిట్టంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

## గోవులను తరలిస్తున్న లారీ పట్టివేత



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** ఛిట్యాల రైల్వే స్టేషన్ క్రాస్ రోడ్డు వద్ద గోవులను అక్రమంగా తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు ఛిట్యాల రైల్వే స్టేషన్ క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించగా, అనుమానాస్పదంగా వెళ్తున్న ఒక లారీ దీ.చీశీ : టి జి 12 యు 6043 అనే నశీబర్ గల లారీ ని ఆపి పరిశీలించారు. లారీలో గోవులను అక్రమంగా మరియు నిబంధనలకు విరుద్ధంగా హైదరాబాద్ లోని గోవధశాలకు తరలిస్తున్నట్లు గుర్తించారు. పశువులకు సరైన రవాణా అనుమతులు లేకపోవడంతో పాటు క్రూరంగా తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.దీంతో పోలీసులు లారీని స్వాధీనం చేసుకొని, అందులో ఉన్న 52 ఆవులను రక్షించి చింతపల్లి లోని గోశాలకు తరలించారు. లారీ డ్రైవర్ మున్నాఎస్/ఓ అబ్దుల్ రెహ్మాన్ ఆర్/ఓఉత్తర ప్రదేశ్ మరియు సంబంధిత వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని చిట్యాల ఎస్సై యం.రవి కుమార్ తెలిపారు.



## ఓఆర్ఆర్‌పై 400 కిలోల గంజాయి పట్టివేత....



**గచ్చిబౌలి క్రైమ్ మిర్రర్ :** సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ హద్దులో ఓఆర్ఆర్ ముత్తంగి సమీపంలో సోట్ కూకట్‌పల్లి బృందం, పటాన్‌చెరు పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో అంతర్రాష్ట్ర గంజాయి ముఠాను పట్టుకుని 400 కిలోల డ్రై గంజాయి, ఒక డీసీఎం వాహనం, ఒక ఎర్టిగా కారు, ఆరు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ సుమారు రూ.2 కోట్లుగా పోలీసులు తెలిపారు. మహారాష్ట్రకు చెందిన మహిళ రిసీవర్‌గా, ఒడిశాకు చెందిన వ్యక్తి సరఫరాదారుగా వ్యవహరిస్తుండగా, మధ్యవర్తులు మరియు డ్రైవర్ల సహకారంతో ఒడిశా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి నుంచి మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఖాళీ కూరగాయల ప్లాస్టిక్ ట్రేల కింద గంజాయిని దాచిపెట్టి డీసీఎంలో తరలిస్తుండగా, ఎస్కార్ట్ వాహనంగా ఎర్టిగా కారును ఉపయోగించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ఏడుగురిని అదుపులోకి తీసుకుని, ఇద్దరు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## శివరాంపల్లి బ్లూ డాల్ఫిన్ స్విమ్మింగ్ క్లబ్‌లో... ఉత్సాహభరితంగా
# 3వ ఫిన్ స్విమ్మింగ్ రాష్ట్ర ఛాంపియన్‌షిప్ పోటీలు





**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** బ్లూ డాల్ఫిన్ స్విమ్మింగ్ క్లబ్‌లో 3వ ఫిన్ స్విమ్మింగ్ రాష్ట్ర ఛాంపియన్‌షిప్ , ఆక్వా బిగినర్ టాలెంట్ హంట్ ఫెస్టివల్ ఉత్సాహభరితంగా కొనసాగింది. శివరాంపల్లి బ్లూ డాల్ఫిన్ స్విమ్మింగ్ క్లబ్‌లో ఫిన్‌స్విమ్మింగ్ రాష్ట్ర ఛాంపియన్‌షిప్-కమ్-జాతీయ ఎంపిక ట్రయల్స్‌తో పాటు ట్విన్ సిటీ ఆక్వా ఫెస్టివల్ బిగినర్ టాలెంట్ హంట్‌ను నిర్వహించారు. ఈ పోటీలలో వివిధ జిల్లాల నుండి 150 మందికి పైగా ఈతగాళ్లు పాల్గొని, ఛాంపియన్‌షిప్‌లో పోటాపోటీ పడ్డారు. ఈ పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఈతగాళ్లకు జరుగబోయే జాతీయ స్థాయి ఫిన్‌స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపిక చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కాగా, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జి. రాధిక ఐపిఎస్ మాట్లాడుతూ జల క్రీడలను ప్రోత్సహించడం వల్ల యువత లోని ప్రతిభను పెంపొందించడానికి దోహదం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా బ్లూ డాల్ఫిన్ స్విమ్ క్లబ్ వ్యవస్థాపకుడు , తెలంగాణ ఫిన్‌స్విమ్మింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ దినేష్ రాజోరియా మాట్లాడుతూ ఫిన్ స్విమ్మింగ్‌ను ప్రోత్సహించడం, జాతీయ స్థాయి పోటీల కోసం ప్రతిభావంతులైన ఈతగాళ్లను గుర్తించడం ప్రధాన లక్ష్యంగా ఛాంపియన్‌షిప్‌ను నిర్వహించినట్లు తెలిపారు. జల క్రీడలను ప్రోత్సహించడానికి కోచ్‌లు , యువత తల్లిదండ్రుల అంకితభావాన్ని ఆయన అభినందించారు. ఇలాంటి పోటీలు తెలంగాణ నుండి భవిష్యత్ ఛాంపియన్‌లను తయారు చేయడానికి సహాయపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ పోటీల్లో బోడుప్పల్లోని సిద్ధార్థ పబ్లిక్ స్కూల్కు చెందిన విద్యార్థి పిఎం రుత్విక్ బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో సర్దార్ భాషా పట్టన్, శివాషు రాయ్, క్లబ్ అధ్యక్షురాలు జ్యోతి, కోచ్ జగన్ రావు తదితరులు పాల్గొన్నారు...

## గ్రేటర్ జర్నలిస్టుల సొసైటీని గుర్తించండి
### మంత్రి పొంగులేటి కి సొసైటీ ప్రతినిధుల విజ్ఞప్తి
### సొసైటీలన్నీ ఏకతాటిపైకి రావాలన్న మంత్రి



**హైదరాబాద్ (బాలాపూర్ క్రైమ్ మిర్రర్):** జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు కేటాయింపులో తమ గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ని గుర్తించాలని సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మామిడి సోమయ్య, బొల్లం శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు వారు సోమవారం సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి సొసైటి వివరాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు నివాస స్థలాలు, గృహ వసతి కల్పించేందుకు 2008 లో ఏర్పడిందని, ఈ సొసైటీలో గడిచిన 17సంవత్సరాలలో నాలుగు దఫాలుగా జర్నలిస్టుల సభ్యత్వ నమోదు చేయడం జరిగిందని, ప్రస్తుతం సొసైటీలో హైదరాబాద్ జిల్లాతో సహా జీహెచ్ఎంసీ పరిధిలోని వివిధ మున్సిపాలిటీలలో వివిధ పత్రికలు, టీవీ చానళ్ళలో పని దాదాపు వెయ్యి మందికి పైగా జర్నలిస్టులు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. అయినప్పటికీ తమ సొసైటీని ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవడం లేదని, జర్నలిస్టు హౌసింగ్ సొసైటీలతో ఏర్పాటు చేసే సమావేశాలకు సొసైటీని ఆహ్వానించకపోవడం, జేఏసీ లో తమను భాగస్వామ్యం చేయకపోడం చాలా బాధాకరమని అన్నారు. ప్రజా ప్రభుత్వానికి మేము వ్యతిరేకం కాదని, తమ సొసైటీకి స్థలం ఇవ్వాలని గత ప్రభుత్వాన్ని పలు మార్లు అడిగినప్పటికీ స్థలం ఇవ్వలేదని, సొసైటీ నిబంధన ప్రకారం స్థలం కేటాయిస్తే అందుకు ప్రభుత్వం నిర్ణయించిన నామినల్ ధర చెల్లించడానికి తాము సిద్ధంగా ఉన్నామని కూడా గత ప్రభుత్వానికి పలు మార్లు తెలియజేయడం జరిగిందని, అయినా అప్పటి ప్రభుత్వం జర్నలిస్టుల ఇళ్లస్థలాల సమస్యను పట్టించుకోలేదని అన్నారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలోనైనా తమ సొసైటీ సభ్యులైన జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు కేటాయించి న్యాయం చేయాలని వారు మంత్రిని కోరారు. అనంతరం మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డిని, ఐఅండ్ పీఆర్ స్పెషల్ కమీషనర్ ముకుంద రెడ్డిని కలిసి వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ నాయకులు రవికుమార్, శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.తమ ప్రభుత్వం అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ళస్థలాలు ఇవ్వడానికి చిత్తశుద్ధతో ప్రయత్నం చేస్తుందని, ఇందుకోసం జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీలన్నీ ఏకతాటిపైకి రావాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, ఐఅండ్ పీఆర్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం సచివాలయంలో తనను కలిసిన గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ, అన్ని సొసైటీలు కలిసి జేఏసీగా ఏర్పడి అర్హులైన జర్నలిస్టుల జాబితాను తయారు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

## మోదీ సభ విజయవంతం -- తెలంగాణలో మార్పునకు సంకేతం...అత్తికారి మల్లేష్



**బాలానగర్, మే 11 (క్రైమ్ మిర్రర్) :** సికింద్రాబాద్‌లో నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభ అశేష జనవాహిని మధ్య అత్యంత విజయవంతం కావడంపై కూకట్‌పల్లి నియోజకవర్గ సీనియర్ నాయకులు అత్తికారి మల్లేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ ప్రజలకు, బీజేపీ కార్యకర్తలకు, మోదీ అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.పశ్చిమ బెంగాల్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లో బీజేపీ సాధిస్తున్న వరుస విజయాలే ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రజలకున్న నమ్మకానికి నిదర్శనమని తెలంగాణలో మార్పు ఖాయమని మల్లేష్ పేర్కొన్నారు. నిన్నటి సభకు తరలివచ్చిన జనసందోహాన్ని చూస్తుంటే, తెలంగాణలో తదుపరి ప్రభుత్వం బీజేపీదేనన్న స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సబ్‌కా సాథ్ – సబ్‌కా వికాస్ లక్ష్యంగా కులమతాలకు అతీతంగా 'అందరి వాడు'గా మోదీ పాలన సాగుతోందని, కేంద్ర పథకాలు ప్రతి పేదవాని గడపకు చేరుతున్నాయని కొనియాడారు. ప్రధాని మోదీ పర్యటనలు కేవలం రాజకీయ సభలు మాత్రమే కావు.. అవి దేశాభివృద్ధికి దిశానిర్దేశం చేసే యజ్ఞాలు. తెలంగాణలో కూడా ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని, అందుకు బీజేపీయే సరైన ప్రత్యామ్నాయమని నిన్నటి సికింద్రాబాద్ సభతో తేలిపోయింది,"కూకట్‌పల్లి బీజేపీ సీనియర్ నాయకులు అత్తికారి మల్లేష్, పేర్కొన్నారు. తెలంగాణ భవిష్యత్తును మార్చడానికి బీజేపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని, ప్రధాని ఇచ్చిన పిలుపుతో కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నెలకొందని మల్లేష్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. రానున్న రోజుల్లో కూకట్‌పల్లి నియోజకవర్గంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు నేతృత్వంలో పార్టీని మరింత బలోపేతం

# ప్రజా దర్బార్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

## సిపిఐ(ఎం) పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ డిమాండ్

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రజాదర్బార్ లో పాలేరు డివిజన్ వ్యాప్తంగా వేలాది సంఖ్యలో ప్రజలు నుంచి దరఖాస్తుల రూపంలో రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఇచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఐ(ఎం) పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీపీఐ(ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనంలో పార్టీ మండల కమిటీ సమావేశం పగిడికత్తుల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న ప్రజా సమస్యలను పరిష్కరించడంలో, ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గత రెండేళ్ల క్రితం ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలనలో ప్రజల నుంచి వేలాది సంఖ్యలో దరఖాస్తులు ఇచ్చిన ఏ ఒక్కటి పరిష్కరించని ప్రభుత్వం నేడు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక, ప్రజాదర్బార్ అంటూ హడావుడి చేస్తూ సమస్యల నుండి ప్రజలను తప్పుదారి



పట్టించేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన రైతు రుణమాఫీని సంపూర్ణంగా అమలు చేయకపోగా వడ్లకు బోనస్ అంటూ ఒక్కసారి మురిపించి రైతులను పక్కదారి పట్టించిందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం పేరుతో పేదల సొంతింటి కల నెరవేరుస్తామంటూ ప్రగల్బాలు పలుకుతూ అనర్హులకు, పార్టీ కండువాలు కప్పుకున్న వారికే ఇండ్లు కేటాయిస్తూ నిజమైన లబ్ధిదారులకు మొండి చేయి చూపిస్తున్నారన్నారు. ధరణి మోసం అంటూ భూభారతి తెచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసింది శూన్యం అన్నారు. సిపిఐ(ఎం) తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలు పోరాటాలతో రైతులు పండించిన ధాన్యం మొక్కజొన్న పంటలను అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం కొనుగోళ్లలో అధికారులు నిర్వాహకులు చేస్తున్న జాప్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పాలేరు డివిజన్ వ్యాప్తంగా ఏర్పాటుచేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలలో కాంటాలు వేసి నెల రోజులకు పైగా గడిచిన రవాణా చేయకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. నేలకొండపల్లి మండలంలోని మోటాపురం మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో కాంటావేసిన బస్తాలను స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయానికి తరలించి నాలుగు రోజులు గడుస్తున్న గోడౌన్లలో నిలువు చేసుకునేందుకు సంబంధిత అధికారులు నేటికీ అనుమతించకపోవడంతో రైతులు తమ మొక్కజొన్న బస్తాల వద్ద పడికాపులు కాయలేక నరకం చూస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలకు రైతులు తరలించిన మొక్కజొన్న, ధాన్యం రాశులను తక్షణమే కాంటాలు వేయాలని, కాంటాలు వేసిన బస్తాలను ఎగుమతి చేసి సంబంధిత గోడౌన్లకు తరలించాలని డిమాండ్ చేశారు. ప్రజాదర్బార్ లో ప్రజలు ఇచ్చిన సమస్యలలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని, పెన్షన్లు, రేషన్ కార్డులు, నిరుద్యోగ భృతి, వ్యవసాయ కార్మికులకు ఏడాదికి 12 వేల రూపాయలు వంటి సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనియెడల గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజలను చైతన్యవంతం చేసి ఉద్యమాలను ఉధృతం చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కెవి రామిరెడ్డి, నాయకులు రచ్చ నరసింహారావు, బెల్లం లక్ష్మి, మారుతి కొండలరావు, దండా సూర్యనారాయణ, మందడపు మురళీకృష్ణ, యడ్ల తిరుపతిరావు, ఎరదేశి నరసింహారావు, దేగల వెంకటేశ్వరరావు, దుగ్గి నరసింహారావు, రాసాల నవీన్, పెద్దిరాజు నరసయ్య, బొడ్డు మధు, గుగులోతు వీరు నాయక్ పాల్గొన్నారు.

# మొక్కజొన్న బస్తాలను గోడౌన్లకు తరలించేందుకు అనుమతించాలి

### సమస్య పరిష్కరించకుంటే రైతులను సమీకరిస్తాం ఆందోళనకు పూనుకుంటాం

### తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు హెచ్చరిక


**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** నేలకొండపల్లి మండలంలోని మోటాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో కాంటాలు వేసిన బస్తాలను స్థానిక వ్యవసాయ మార్కెట్ గోడౌన్లకు తరలించేందుకు అధికారులు అనుమతించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటాపురం కొనుగోలు కేంద్రంలో మొక్కజొన్నలను కాంటావేసి నెల రోజులకు పైగా గడుస్తున్నా గోడౌన్లకు తరలించడంలో అధికారులు, సంబంధిత నిర్వాహకులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు. గత కొద్దిరోజులు క్రితం మండలంలో ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో నిర్వహించిన ప్రజాదర్బారులో సాక్షాత్తు రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన సమస్య పరిష్కారం కాకపోవడం వారి అసమర్ధకు అద్దం పడుతుందన్నారు. రైతాంగ సమస్యపై మంత్రికి చెప్పి వారం రోజులు గడుస్తున్న అధికారులు స్పందించకపోవడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం




లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రం నుండి స్థానిక వ్యవసాయ మార్కెట్ గోడౌన్లకు తరలించాలని చెప్పడంతో రైతులు తమ సొంత ట్రాక్టర్లతో పాటు అద్దెకు తెచ్చిన ట్రాక్టర్లతో తమ మొక్కజొన్న బస్తాలను స్థానిక వ్యవసాయ మార్కెట్ కు తరలించారన్నారు. కాంట వేసిన బస్తాలను మార్కెట్కు తీసుకొచ్చి నాలుగు రోజులు గడిచిన గోడౌన్ల లకు తరలించేందుకు అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. వ్యవసాయ సీజన్ తరుముకొస్తున్న తరుణంలో కాంటాలు వేసిన బస్తాలతో ట్రాక్టర్లన్నీ వ్యవసాయ మార్కెట్లో రోజుల తరబడి నిలిచిపోయాయన్నారు. ట్రాక్టర్లతో దుక్కులు దున్నుకోలేక, అద్దెకు తెచ్చిన ట్రాక్టర్లతో కిరాయిలు భరించలేక రైతులు నరకం చూస్తున్నారన్నారు. ఆరుగాలం అనేక వ్యయ ప్రయాసల కోర్చి పంటలు సాగు చేసిన అమ్ముకునే సమయంలో కూడా ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రభుత్వం తక్షణమే స్పందించి కొనుగోలు కేంద్రాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, కాంటాలు వేసిన బస్తాలను తక్షణమే ఎగుమతి చేసి సంబంధిత గోడౌన్లకు తరలించాలని డిమాండ్ చేశారు. లేనియెడల రైతులను పెద్ద ఎత్తున సమీకరించి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. స్పందించిన తహసిల్దార్ రామ్మోహన్రావు సోమవారం సాయంత్రం వరకు అధికారుల నుండి మొక్కజొన్న బస్తాలను గోడౌన్లకు తరలించేందుకు అనుమతించేలా చూస్తానని హామీ ఇచ్చారు. తహసిల్దారును కలిసిన వారిలో తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ఇంటూరి అశోక్, రచ్చ నరసింహారావు, సిపిఐ(ఎం) మండల కార్యదర్శి కెవి రామిరెడ్డి, నాయకులు మారుతి కొండలరావు, ఎడ్ల తిరుపతిరావు, దేగల వెంకటేశ్వరరావు, రాసాల నవీన్, పెద్దిరాజు నరసయ్య, గుగులోతు వీరు నాయక్ రైతులు పాల్గొన్నారు.

# అక్రమంగా జంతువులను తరలిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు.: ఎస్పీ రోహిత్ రాజు.

**భద్రాద్రి కొత్తగూడెం మే 11:** రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతలను పటిష్టంగా అమలు చేయడంలో భాగంగా అక్రమంగా జంతువులను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇతర శాఖల అధికారులతో సమన్వయంతో అక్రమ జంతు రవాణాను అరికట్టడానికి పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు చేపడుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా చెక్ పోస్టను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా తనిఖీలను చేపట్టడం జరుగుతుందని వివరించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పశువుల సంతలు, బక్రీద్ పండుగ దృష్ట్యా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల పనితీరు తదితర విషయాలపై అధికారులకు ఖచ్చితమైన ఆదేశాలను జారీ చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో ఎక్కడైనా చట్ట విరుద్ధంగా ఆవులు,దూడలను అక్రమంగా రవాణా చేసి,వధించడం పూర్తిగా నిషేధమని,అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి జంతువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు 02 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, 03అంతర్ జిల్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, మొత్తం 05 చెక్‌పోస్టుల వద్ద 24/7 నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి చెక్‌పోస్టులో పోలీస్ సిబ్బందితో పాటు పశుసంవర్ధక శాఖ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తూ



వాహనాల తనిఖీలు కఠినంగా చేపడుతున్నట్లు వెల్లడించారు.జంతువుల రవాణా సమయంలో సంబంధిత చట్టాలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా పశువులను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి రాజీ ఉండదని హెచ్చరించారు. అలాగే అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని, వ్యక్తిగత దాడులు, గుంపులుగా దాడులు చేయడం కూడా శిక్షార్హమైన నేరాలని ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు.ప్రజలు అప్రమత్తంగా ఉండి పశువుల అక్రమ రవాణా,అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ముఖ్యంగా యువత ఆవేశానికి లోనవకుండా బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని, మత పెద్దలు యువతకు శాంతి,సామరస్యాలపై అవగాహన కల్పించాలని సూచించారు.సోషల్ మీడియా వేదికలైన వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి వాటిలో పశువుల అక్రమ రవాణాకు సంబంధించి విద్వేషాలను రెచ్చగొట్టేలా మార్ఫింగ్ ఫోటోలు, అసత్య ప్రచారాలు, ప్రేరేపిత పోస్టులు పెట్టినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందుకోసం జిల్లా పోలీస్ మీడియా మానిటరింగ్ సెల్ నిరంతర నిఘా ఉంచిందని తెలిపారు. ప్రజల్లో భయాందోళనలు కలిగించే రూమర్లు వ్యాప్తి చేసిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని,డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్ను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ప్రతీ పండుగ సందర్భంగా ప్రజలు పరస్పరం మతాలను గౌరవించుకుంటూ, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు.జిల్లాలో శాంతి భద్రతలను కాపాడటానికి ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథను అరెస్టు చేయాలి

**వత్తాసు పలుకుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్ ని మంత్రివర్గం నుంచి తొలగించాలి : ఎమ్మెల్సీ తాతా మధుసూదన్**



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** రాజకీయ అధికారాన్ని అడ్డుపెట్టుకుని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారు డు బండి భగీరథ మైనర్ బాలికపై చేసిన అమానుష అఘాయిత్యాన్ని కప్పిపుచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలు అటవీక సమాజాన్ని తలపిస్తున్నది. ఒక అమాయకపు చిన్నారిపై జరిగిన ఈ దారుణమైన ఘటనలో బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి, నిందితులను రక్షించడానికి అధికార యంత్రాంగం మరియు పోలీసులు బరితెగించడం దారుణం. ఈ కేసులో అత్యంత కఠినంగా ఉండాల్సిన పోక్సో చట్టం కింద నమోదు చేయాల్సిన సెక్షన్లను, కావాలనే బలహీన పరిచి, నిందితుడిని బయటపడేసేలా వ్యవహరిస్తున్న పోలీసుల తీరుపై తీవ్ర నిరసన వ్యక్తంచేస్తుంది. కేంద్ర హోమ్ మంత్రి గా పదవి వెలగబెడుతూ చట్టాన్ని తన గుప్పిట్లో పెట్టుకోవాలని చూస్తున్న బండి సంజయ్ దుశ్చర్యలను చూస్తుంటే ప్రజాస్వామ్యం ఎటువైపు వెళ్తుందో అన్న ఆందోళన కలుగుతోంది. మైనర్ బాలిక కుటుంబ సభ్యులపై బండి సంజయ్ కుటుంబ సభ్యులు సాగిస్తున్న ఈ దుర్మార్గమైన దాష్టీకాన్ని, పోలీసుల వైఫల్యాన్ని బిఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది. మైనర్ బాలిక అని తెలిసినా బండి సంజయ్ కుమారుడు అత్యాచారానికి ఒడిగట్టాడు. పోక్సో కేసు నమోదు అయిన వెంటనే నిందితుడిని అరెస్ట్ చేయాలి మరి బండి సంజయ్ కుమారుడు ఎందుకు అరెస్ట్ చేయడం లేదు? నిందితుడిని అరెస్టు చేయకపోగా తిరిగి బాధితులపైనే కేసు పెట్టడం ఆశ్చర్యకరం. భారతీయ విలువలను వల్లవేసే భారతీయ జనతా పార్టీ తక్షణమే బండి సంజయ్ ను కేంద్ర మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలి లేదా బండి సంజయ్ స్వయంగా తన పదవికి రాజీనామా చేయాలి. పోక్సో కేసులో నిందితుడైన బండి సంజయ్ కుమారుడు భగీరత్ ను వెంటనే అరెస్ట్ చెసి మైనర్ బాలికకు న్యాయం చేయాలని బి ఆర్ ఎస్ పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నాను.

# ఎస్ఎస్సీ ఫలితాల్లో మెరిసిన గుండమల్ల అక్షితకు రాష్ట్ర స్థాయి అభినందనలు



**సంస్థాన్ నారాయణపురం,మే 11(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల టాపర్‌గా నిలిచిన ప్రభుత్వ జిల్లా పరిషత్ (బాలికల) ఉన్నత పాఠశాల విద్యార్థిని గుండమల్ల అక్షిత.569 మార్కులతో ప్రతిభ కనబర్చినది హైదరాబాదు,రవీంద్రభారతిలో బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ (బీసీటీఏ) తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు కే. కృష్ణుడు అధ్యక్షతన ఘనంగా నిర్వహించిన "మహాత్మా జ్యోతిబా పూలే ప్రతిభా పురస్కారాలు --2026" కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎస్సీ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన మండల స్థాయి టాపర్లకు, ప్రధానోపాధ్యాయులకు ఈ సందర్భంగా ఆత్మీయ సన్మానాలు నిర్వహించారు.రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు విద్యార్థిని గుండమల్ల అక్షిత తల్లిదండ్రులను, పాఠశాల ప్రధానోపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విద్యార్థిని గుండమల్ల అక్షిత మాట్లాడుతూ, "ఐఎఎస్ కావలనే మా తల్లిదండ్రుల కల. వారి ఆశయాన్ని నెరవేర్చేందుకు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవడానికి నిరంతరం శ్రమిస్తాను" అని తెలిపింది. ఆమె మాటలు సభలో ఉన్న వారిని ప్రేరణ కలిగించాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ,పలువురు విద్యావేత్తలు,ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యం



గండిపేట(క్రైం మిర్రర్): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి కనిపించకుండాపోయిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రేమావతిపేట ప్రాంతానికి చెందిన కె.జయన్న(40) ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో చుట్టు పక్కల ప్రాంతాలు బంధువులు, స్నేహితుల వద్ద వాకాబు చేసిన ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యులు రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంలో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
మంగళవారం 12-5-2026


# త్వరలో రామకృష్ణాపూర్ పట్టణ కాంగ్రెస్ కమిటీలు

**20 ఏళ్ల తర్వాత పూర్తిస్థాయిలో నియామకాలు**

**మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తీరుపై విమర్శలు**

**ముంపు రైతులకు రూ.33 కోట్ల పరిహారం అందించిన ఘనత మంత్రి వివేక్‌దే**



**రామకృష్ణాపూర్, మే 11(క్రైమ్ మిర్రర్):** పట్టణంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ తెలిపారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ సహకారంతో రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అన్ని విభాగాల్లో పూర్తిస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

**20ఏళ్ల తర్వాత పట్టణ కాంగ్రెస్ కమిటీలు**

దాదాపు రెండు దశాబ్దాల విరామం తర్వాత పట్టణ కాంగ్రెస్ పార్టీకి అన్ని అనుబంధ విభాగాల్లో కార్యవర్గాలను నియమిస్తున్నట్లు నేతలు పేర్కొన్నారు. ఇప్పటికే ఆశావాహుల నుంచి దరఖాస్తులు స్వీకరించామని, మరో రెండు మూడు రోజుల్లో అధికారికంగా జాబితాను ప్రకటిస్తామని చెప్పారు. ప్రతి కార్యకర్త ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**నాడు దాడులు చేసి.. నేడు అక్రమ కేసులా?**

మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వ్యాఖ్యలపై నేతలు తీవ్రంగా మండిపడ్డారు. చైర్‌పర్సన్ ఎన్నికల రోజు మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకుని, ట్రాఫిక్ కోన్‌తో దాడికి యత్నించింది బీఆర్ఎస్ నాయకులేనని ఆరోపించారు. అక్కడే ఉన్న కానిస్టేబుల్, కాంగ్రెస్ కార్యకర్తలపై రాళ్లతో దాడి చేసిన ఘటనను రాష్ట్రమంతా చూసిందన్నారు. "హింసను ప్రోత్సహించినందుకే చట్టపరంగా కేసులు నమోదయ్యాయి. వాటిని అక్రమ కేసులు అని మీడియా ముందు ప్రచారం చేయడం సరికాదు. చట్టానికి ఎవరూ అతీతులు కారు" అని స్పష్టం చేశారు.

**రైతు సంక్షేమానికి పెద్దపీట**

గత ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం బ్యాక్‌వాటర్ వల్ల నష్టపోయిన రైతులను పలకరించిన పాపాన పోలేదని దుయ్యబట్టారు. "మంత్రి వివేక్ వెంకటస్వామి ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ముంపు భూములను సర్వే చేయించి, బాధిత రైతులకు రూ.33 కోట్ల నష్టపరిహారం ఇప్పించారు. చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తూ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోంది" అని పేర్కొన్నారు. కమీషన్ల కోసం నాడు రైతులను ఇబ్బంది పెట్టిన వారు నేడు రైతుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి గోపతి బానేష్, కౌన్సిలర్లు గుర్రం శ్రీనివాస్, భీమ మల్లేష్, మాజీ చైర్‌పర్సన్ జంగం కళ, సీనియర్ నాయకులు గడ్డం శ్రీనివాస్ గౌడ్, గోపు రాజం తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా బీఈఎస్.టిఐయూ అంతర్జాతీయ సదస్సు

**పరిశోధనలు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలి... ఛాన్సలర్ డా. రూపా వాసుదేవన్**

**కూకట్ పల్లి, మే 11 (క్రైమ్ మిర్రర్) :** పరిశోధనలు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా సమాజ సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలు అందించేలా ఉండాలని భారతీయ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ (బీఈఎస్.టిఐయూ) ఛాన్సలర్ డా. రూపా వాసుదేవన్ పేర్కొన్నారు. హైదరాబాద్ ఉప్పల్ లోని బీఈఎస్.టిఐయూ పరిశోధన, ఆవిష్కరణ కేంద్రం ఆధ్వర్యంలో పరిశోధనలో సృజనాత్మకత ఆవిష్కరణ అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు ఘనంగా జరిగింది. సదస్సును ఛాన్సలర్ డా. రూపా వాసుదేవన్, వైస్ చాన్సలర్ డా. కె. నాగజ్యోతి, సైంటిఫిక్ చైర్ డా. ఆశుతోష్ శర్మ, ముఖ్య అతిథి డా. గోపాల్ లాల్, గౌరవ అతిథి డా. వల్లీ మణికం ప్రారంభించారు. దేశ విదేశాల నుంచి శాస్త్రవేత్తలు, పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. రూపా వాసుదేవన్ మాట్లాడుతూ, సమాజానికి ఉపయోగపడే పరిశోధనల ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అంతర్జాతీయ సదస్సులు శాస్త్రీయ పరస్పర వినిమయానికి వేదికలని, విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచన, స్వతంత్ర పరిశోధన దృక్పథం పెంపొందించేందుకు విశ్వవిద్యాలయం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని వైస్ చాన్సలర్ డా. కె. నాగజ్యోతి పేర్కొన్నారు. ఆధునిక పరిశోధన విధానాలు, సాంకేతిక పురోగతి, సృజనాత్మక సమస్య పరిష్కారాలపై చర్చించేందుకు ఈ సదస్సు ఉత్తమ వేదికగా నిలిచిందని డా. ఆశుతోష్ శర్మ తెలిపారు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో పరిశోధనలో సృజనాత్మకత ఆవిష్కరణ అంశంపై సదస్సు నిర్వహించడం సమయోచితమని డా. గోపాల్ లాల్ అభిప్రాయపడ్డారు. సదస్సులో ప్రధాన ప్రసంగాలు, సాంకేతిక సెషన్లు, పేపర్ ప్రెజెంటేషన్లు, ప్యానెల్ చర్చలు నిర్వహించగా, పరిశోధకులు తమ వినూత్న పరిశోధన పత్రాలను సమర్పించారు. అనంతరం పేపర్ ప్రెజెంటర్లకు, పరిశోధకులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సదస్సు ద్వారా పరిశోధన, ఉన్నత విద్య రంగాల్లో సృజనాత్మకత, ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో బీఈఎస్.టిఐయూ తన నిబద్ధతను చాటిచెప్పింది.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా విద్యా వారోత్సవాలు,

# కరపత్రం విడుదల చేసిన మేయర్ చైతన్య రెడ్డి




క్రైమ్ మిర్రర్, నల్లగొండ బ్యూరో: ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల కరపత్రం విడుదల కార్యక్రమం నల్లగొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్)లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కాగా, 47వ వార్డు కార్పొరేటర్ శ్రీమతి అప్పగోని కవిత ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. కళాశాల సిబ్బందితో కలిసి కలిసి వారు విద్యా వారోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు.

**విద్యార్థినులలో నైపుణ్యాలను పెంపొందిచాలి!**

ముఖ్య అతిథి మేయర్ బుర్రి చైతన్య రెడ్డి మాట్లాడుతూ, ఈ విద్యా వారోత్సవాలు కేవలం సభలు, ప్రసంగాలకే పరిమితం కాకుండా విద్యార్థినులలో నైపుణ్యాలను పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ప్రేరణనిస్తాయని చెప్పారు. విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలపై అవగాహన పెంచడం ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని వివరించారు.

**ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య**

ప్రత్యేక అతిథి శ్రీమతి అప్పగోని కవిత మాట్లాడుతూ, ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని తెలిపారు. మహిళల ఉన్నత విద్య కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ కళాశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు. విద్యార్థినులు మంచి భవిష్యత్తు కోసం ప్రభుత్వ మహిళా కళాశాలను ఎంపిక చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.

**విద్యార్థినులకు ఉపాధి అవకాశాలు**

కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. శ్రీనివాసరాజు మాట్లాడుతూ, విద్యార్థుల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఈ విద్యా వారోత్సవాలను ప్రత్యేకంగా రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమం మొదటి రోజున కరపత్రం విడుదలతో పాటు వివిధ కంపెనీల ప్రతినిధులతో అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు) కుదుర్చుకున్నామని చెప్పారు. ఈ ఒప్పందాలు విద్యార్థినులకు భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు పెంచడంలో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమ కోఆర్డినేటర్ డాక్టర్ టి. శ్రీనివాసులు మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన విద్యా వారోత్సవాలను తేదీల వారీగా విజయవంతంగా నిర్వహించాలని అధ్యాపకులను కోరారు. విద్యార్థులలో చైతన్యం తీసుకురావడానికి ఈ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీమతి మంజుల, అధ్యాపకులు డాక్టర్ పుష్పలత, డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ వసంత, డాక్టర్ ఎస్. రాజారామ్, రామ్ రెడ్డి, డాక్టర్ వెంకటకృష్ణ, డాక్టర్ నరేష్, మల్లికార్జున్, రాజు, శైలజ, సమత, మిస్కిన్, సరిత తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో కళాశాల విద్యార్థినులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పాపిరెడ్డి నగర్ లోని అక్రమ వాటర్ ప్లాంట్లను తొలగించాలి

**ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన పాపిరెడ్డి నగర్ బస్తి అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి**



**కూకట్ పల్లి, మే 11 (క్రైమ్ మిర్రర్) :** పాపిరెడ్డి నగర్ లోని అక్రమ వాటర్ ప్లాంట్లను తొలగించాలని మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టర్ కార్యాలయం ప్రజావాణిలో సబ్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద కి పాపిరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఊట్ల చంద్ర రెడ్డి వినతి పత్రం అందించారు. అనంతరం చంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ అక్రమ ప్లాంట్ల వలన బుగర్భజలు అడుగంటుతున్నాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నారని అన్నారు. బుగర్భజలాలు అడుగంటడం వలన బోర్లు వెయ్యి ఫీట్లనుండి పదిహేను వందల ఫిట్లు వెయ్యాల్సి వస్తుందని, ఇలా వెయ్యడం వలన ముందు తరాలకు నీళ్ల కరువు ఏర్పాడుతుందని తెలిపారు. వాటర్ ప్లాంట్లలో మూడు వంతుల నీరు వృధా అవుతుందని వెంటనే పాపిరెడ్డి నగర్ లో ఉన్న వాటర్ ప్లాంటలని తొలగించాలని ప్రధాన కార్యదర్శి ఆర్ భగవంత రెడ్డి, క్యాషియర్ నరసింహులు ముదిరాజ్, అడ్వైజర్ అనంతరాములు, సిహెచ్ సత్యనారాయణ రెడ్డి, ఏ. ప్రభాకర్, పి. శంకర్ రెడ్డి, ఎన్ బాల్ రెడ్డి, టి రాజిరెడ్డి, కె యాదగిరి, జె శంకర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, మహేష్, బస్తీ వాసులు వినతి పత్రం అందించారు.

# నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

**లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేసిన కొలన్ హన్మంత్ రెడ్డి**



**కుత్బుల్లాపూర్, మే 11 (క్రైమ్ మిర్రర్) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో పలువురు పేద ప్రజలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ, చికిత్స ఖర్చులకు సరిపడా ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ని సంప్రదించగా, ఆయన వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. సోమవారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరి పత్రాలు (చెక్కులు) అందజేశారు. రోడమేస్త్రీ నగర్ లో నివాసముండే రఫియా బేగమ్ కి రూ. 35,000, గాజులరామారంకు చెందిన పెరుమల్ల రవి కి రూ. 35000, మొహమ్మద్ రుక్‌ఉద్దిన్ కి రూ. 27,500, దుండిగల్ వాసులు గైక్వార్డ్ రాజు కి రూ. 54,000, జగద్గిరిగుట్ట వాసులు ఫాతీమా కి రూ. 60,000, సుభాష్ నగర్ వాసులు ముంతాజ్ బేగమ్ కి రూ. 60,000, గాజులరామారం వాసులు నేమూరి శ్రీనివాస్ గౌడ్ కి రూ. 37,500, దూలపల్లి వాసులు హిమ బిందు సురకాంతి కి రూ. 42,000, కుత్బుల్లాపూర్ వాసులు కమ్మరి బ్రహ్మయ్య కి రూ.50,000 వేలు చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని, అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది

**ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కమలాక్షి రాజన్**

**కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోంది**

**టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్**



**కూకట్ పల్లి, మే 11 (క్రైమ్ మిర్రర్) :**

మహిళా సాధికారతకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, పార్టీలో ప్రతి ఒక్కకార్యకర్తకు గుర్తింపు ఉంటుందని, అందరికీ తగిన రీతిలో పదవులు ఇవ్వడం జరుగుతుందని ఏఐసీసీ కార్యదర్శి, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కమలాక్షి రాజన్ పేర్కొన్నారు. పార్టీ మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం కూకట్ పల్లి ఎన్ కే ఎన్ ఆర్ గార్డెన్స్ లో జిల్లా మహిళా నాయకుల, కార్యకర్తల సమావేశం పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మహిళా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. టిపిసిసి ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంతో రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అభివృద్ధి సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు పెట్రోల్ బంకులు ఆర్టీసీ బస్సులను రేషన్ కార్డులు పెన్షన్లు అందజేయడం జరుగుతుందన్నారు. 33% మహిళ ల రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ తనయుడు సాయి భగీరథ పై కేసు నమోదు అయినందున నైతికంగా ఆయన తన మంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలని రమేష్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎర్రవెల్లి స్వర్ణలత, మల్కాజ్గిరి పార్లమెంటు నియోజకవర్గం ఇంచార్జ్ సునీత మహేందర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ పుష్పారెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# అక్రమ నిర్మాణాలు అరికట్టాలని కలెక్టర్ కు వినతిపత్రం అందజేత

**తుప్రాన్ పేట గ్రామ సర్పంచ్ బక్కపట్ల రాధిక శ్రీశైలం**



**చౌటుప్పల్, మే 11, క్రైమ్ మిర్రర్:** చౌటుప్పల్ మండలం,తూప్రాన్ పేట్ జాతీయ రహదారి ఎన్ హెచ్ 65 పక్కన 125 సర్వే నెంబర్ గల నాలాకి సంబంధించిన గ్రామపంచాయతీ కాలువ స్థలాన్ని హైదరాబాద్ కు చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని అట్టి నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేసినట్లు తూప్రాన్ పేట గ్రామ సర్పంచ్ బక్కపట్ల రాధిక శ్రీశైలం తెలిపారు. ఇట్టి విషయంపై 2024 సంవత్సరం జనవరి 24 లో ప్రభుత్వానికి ఫిర్యాదు చేయగా అప్పుడు ఉన్న సంబంధిత అధికారులు ఇరిగేషన్ డిపార్మెంట్ వాళ్ళు వచ్చి సర్వే చేసి నాలాగా గుర్తించి మౌలిక హద్దులు నిర్ణయించి ఎటువంటి రిపోర్ట్ ఇవ్వకుండా వెళ్లడం జరిగిందన్నారు.ఆరిపోర్టు ఆలస్యం కారణంగా మళ్లీ అట్టి నాలాను హైదరాబాదు ప్రాంతం నుండి వచ్చిన సదరు వ్యక్తులు తిరిగి నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. ఇట్టి విషయంపై రెండోసారి తూప్రాన్ పేట గ్రామ కార్యదర్శి ,సర్పంచ్ ,పాలకవర్గం మరియు గ్రామ ప్రజలు అక్రమ నిర్మాణాలను జరగకుండా ఆపి, ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేయగా 2026 సంవత్సరం మార్చి 31 న ఒకసారి,2026 సంవత్సరం ఏప్రిల్ 5వ తేదీన మరొకసారి దఫాలుగా విచ్చేసి అధికారులు సర్వే చేసి మౌలికంగా కాల్వ అని నోటి మాట ద్వారా తెలియజేశారని కానీ ఇప్పటివరకు రిపోర్ట్ ఇవ్వలేదని దీని కారణంగా మళ్ళీ సదరు వ్యక్తులు అక్రమ నిర్మాణాలను చేపట్టే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారని కావున దయచేసి దీనికి సంబంధించిన అధికారులు త్వరగా రిపోర్ట్ ఇచ్చి అట్టి నాలాను తవ్వి దానిని పునరుద్ధరణ లోకి తీసుకురావాల్సిందిగా కోరుతూ కలెక్టర్కు వినతిపత్రం అందజేసినట్లు సర్పంచ్ బక్కతట్ల రాధిక శ్రీశైలం తెలిపారు. అట్టి నాలాను పునరుద్ధరణ చేయని యెడల వర్షాకాలంలో జాతీయ రహదారి మొత్తం దిబ్బంధమవుతుందని,వాహనాలు ఆ కాలువ నుండి దాటి వెళ్లకుండా అడ్డుగా ఉంటుందన్నారు. గతంలో 2022 సంవత్సరంలో ఒకసారి జరిగి దాదాపు 8 గంటలు రాత్రి వేళలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిందని, కావున అధికారులు వెంటనే నాలాని పునరుద్ధరించి అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా అట్టి వ్యక్తులపై చర్యలు తీసుకోగలరని వినతి పత్రం ద్వారా కలెక్టర్ ను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బక్కతట్ల రాధిక శ్రీశైలం, ఉప సర్పంచ్ ముద్దం రమేష్, వార్డు మెంబర్లు బొజ్జ స్వామి, పోచమోని పవన్ కుమార్, బక్కతట్ల శ్రీకాంత్, ఏర్పుల శ్రీశైలం, గ్రామ ప్రజలు వరుకూరి యాదయ్య, నార్ల కొండ మల్లేశం, ఎర్ర శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలి

**పోక్సో కేసులో చర్యలేవి?**

**సాధారణ ప్రజలకు ఒక నీతి.. మంత్రి కొడుక్కి మరో నీతా?**

**బిఆర్ఎస్ సోషల్ మీడియా మండల కన్వీనర్ బాపు నాయక్**



**కోటపల్లి, మే 11( క్రైమ్ మిర్రర్):** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైనా ఇప్పటివరకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై బిఆర్ఎస్ సోషల్ మీడియా మండల కన్వీనర్ బాపు నాయక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని బాపు నాయక్ ఆరోపించారు. "ఒక మైనర్ బాలిక మూడు నెలలుగా న్యాయం కోసం పోరాడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటు" అని అన్నారు. బాధితురాలికి రక్షణ కల్పించాల్సింది పోయి, ఆమె కుటుంబ సభ్యులను నేరస్థుల్లా వేధించడం దారుణమని మండిపడ్డారు."బేటీ బచావో" అంటూ నినాదాలు చేసే బీజేపీ నాయకత్వం, ఇప్పుడు కేంద్ర మంత్రి కుటుంబ సభ్యుడిపై ఆరోపణలు వచ్చినప్పుడు ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు. సాధారణ ప్రజల విషయంలో ఒకలా, అధికార పార్టీ నేతల కుటుంబ సభ్యుల విషయంలో మరోలా వ్యవహరించడం సరైంది కాదన్నారు. బాధితురాలు అన్ని ఆధారాలతో ఫిర్యాదు చేసినప్పటికీ నిందితుడిని అరెస్టు చేయకపోవడం పోలీసుల పనితీరుపై అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని, వెంటనే సాయి భగీరథ్‌ను అరెస్టు చేసి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## విద్యా వారోత్సవాలకు శ్రీకారం

**కేఎన్ఎం డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ ప్రచార పోస్టర్ల ఆవిష్కరణ**




మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, మే 11: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక'లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మే 11 నుంచి 17 వరకు విద్యా వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా సోమవారం మిర్యాలగూడలోని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపల్ భీమార్జునరెడ్డి అడ్మిషన్ ప్రచార పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు పెంచే లక్ష్యంతో అధ్యాపకులు, సిబ్బంది కళాశాల విశిష్టతను గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు వివరించాలని సూచించారు. పోస్టర్ల ప్రదర్శనతో పాటు ప్రచార కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు.కళాశాలపై అభిమానంతో పూర్వ విద్యార్థి, ప్రస్తుతం ఉద్యోగిగా ఉన్న నంద్యాల శేఖర్‌రెడ్డి గోడపత్రికను అందజేయడం అభినందనీయమని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. విద్యా వారోత్సవాల్లో భాగంగా వారం రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో సిబ్బంది చురుకుగా పాల్గొనాలని, గ్రామాల్లో సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థుల సహకారంతో అడ్మిషన్ల ప్రచారాన్ని మరింత విస్తరించాలని సూచించారు.కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి.నాగరాజు, ఎన్‌సీసీ సీటీఓ డాక్టర్ గుమ్మడి నరేష్, డాక్టర్ శివకృష్ణ, డాక్టర్ పి.రవీందర్, డాక్టర్ ఆర్.స్వప్న, నాగరేఖారాణి, టి.వెంకటరమణతో పాటు బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో పాలు పంచుకోవాలి

**కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్**




**గండిపేట(క్రైం మిర్రర్):** విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో పాలు పంచుకోవాలని కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ అన్నారు. రంగారెడ్డి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ కిక్ బక్సింగ్ ఛాంపియన్‌షిప్--2026 పోటీలు కాటేదాన్ స్పోర్ట్స్ కంప్లెక్స్‌లో జరిగాయి. రంగారెడ్డి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9, 10వ తేదీల్లో జరిగిన పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ట్రోఫీ ప్రధానంలో ఎస్.వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జనరల్ సెక్రటరీ ఎం.మైపాల్, ఎం.నర్సింగ్‌రావులు ముఖ్య అతిథిని శాలువాలతో సత్కరించారు. దాదాపు 1000 మంది కిక్ బాక్సింగ్ క్రీడాకారులు పాల్గోని ఉత్తమ ప్రతిభకనబరిచారు. ఈ కార్యక్రమంలో సానం రాజుగౌడ్, ఆర్.కుమార్, పోతురాజు రమేష్, గురుస్వామి, అశోక్‌కుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు...: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మే 11: జిల్లాలో ఈ నెల 13 నుండి 21 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై కలెక్టర్ అధ్యక్షతన సంబంధిత శాఖల అధికారులతో కోఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. జిల్లా లో ఈ పరీక్షలకు మొత్తం 13,862 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, అందులో మొదటి సంవత్సరం పరీక్షలకు 9,591 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 4,271 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. జిల్లాలో 27 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు రెండు సెషన్లలో జరుగుతాయని, ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు ఫస్ట్ ఇయర్ పరీక్షలు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండ్ ఇయర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.పోలీస్, ఆర్టీసీ, రెవెన్యూ, పోస్టల్, మెడికల్ అండ్ హెల్త్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రశ్నపత్రాలను ఆయా రూట్ల వారీగా పోలీసు బందోబస్తు మధ్య తరలించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో నిషేధాజ్ఞలు అమలు చేయడంతో పాటు జిరాక్స్ కేంద్రాలను మూసి వేయాలని సూచించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి పరీక్షా కేంద్రంలో రక్షిత మంచినీటి సదుపాయం, పరిశుభ్రమైన వాతావరణం, తగినంత గాలి, వెలుతురు ఉండేలా చూడాలని ఆదేశించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ తీసుకు రావద్దని స్పష్టం చేశారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లతో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలను పరీక్షా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని, పరీక్షల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు రవాణా ఇబ్బందులు తలెత్తకుండా పరీక్షా సమయాలకు అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. విద్యార్థులు పరీక్షా సమయానికి ముందుగానే తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




## వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి**

**గండిపేట(క్రైం మిర్రర్):** రాబోయే వర్షకాలంలో రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని రాజేంద్రనగర్, అత్తాపూర్, చంద్రాయణగుట్ట, జంగంమెట్, ఫలక్‌నూమా, బహదూర్‌పుర సర్కిల్‌లో ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ, హైడ్రా, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో ఆయన వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్ష, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైడ్రా గుర్తించిన వర్షాకాలంలో నీరు నిలచి ఉండే 30 పాయింట్లను ప్రస్తావిస్తూ, వర్షాకాలంలో నీరు నిలువ ఉండే ప్రాంతాలలో ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోని నీరు నిలవకుండా ఉండడానికి కావలసిన పనులు చేయాలన్నారు. అందుకోసం హైడ్రా, జీహెచ్ఎంసీ, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిల్‌లలో నీరు నిలిచే ప్రాంతాలలో ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోని నీరు నిలవకుండా ఉండడానికి కావలసిన పనులు చేయాలన్నారు. రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిల్‌లలోనీరు నిలిచే ప్రాంతాలు 15 ఉన్నాయని, మిగతా సర్కిల్‌లో 15 పాయింట్లు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో హైడ్రా రాజేంద్రనగర్ జోనల్ ఇంచార్జ్ మహేష్, జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ జోన్ ఇంచార్జ్, ఎస్ఈ నరేందర్‌గౌడ్, ఈఈలు వెంకట శేషయ్యలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆత్మ రక్షణకు కరాటే దోహదం




**ప్రతి ఒక్కరు స్వీయ రక్షణ కోసం కరాటే నేర్చుకోవాలి**

**క్రీడల పట్ల ఆసక్తి కలిగిన ఎమ్మెల్యే దొరకడం అదృష్టం**

**సినీ నటుడు సుమన్**

**అట్టహాసంగా ముగిసిన గూడెం విష్ణువర్ధన్ రెడ్డి స్మారక జాతీయ కరాటే పోటీలు**

**విజేతలకు సినీ నటుడు సుమన్ తో కలిసి బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్..**




**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మే 11:** ప్రస్తుత సమాజంలో స్వీయ రక్షణ కోసం విద్యార్థినిలు, మహిళలు తప్పకుండా కరాటే నేర్చుకోవాలని.. దీని ద్వారా మానసిక ప్రశాంతత.. శారీరక ధారుడ్యత లభిస్తుందని సినీ నటుడు సుమన్ అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని భారతరత్న పీవీ నరసింహారావు ఆడిటోరియంలో ఎమ్మెల్యే జిఎంఆర్ సౌజన్యంతో.. లక్కీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన గూడెం విష్ణువర్ధన్ రెడ్డి స్మారక పదవ జాతీయస్థాయి కరాటే ఛాంపియన్షిప్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హీరో సుమన్ మాట్లాడుతూ... క్రీడల పట్ల ఆసక్తి కలిగి నిరంతరం క్రీడల అభివృద్ధికి నిబద్ధతతో కృషి చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి దొరకడం పటాన్‌చెరు నియోజకవర్గం ప్రజల అదృష్టమని అన్నారు. గత పది సంవత్సరాలుగా జాతీయస్థాయి కరాటే ఛాంపియన్షిప్ పోటీలకు సహకారం అందించడం పట్ల అభినందనలు తెలిపారు. తాను విద్యార్థి దశ నుండి మార్షల్ ఆర్ట్స్ ని నేర్చుకోవడం ప్రారంభించామని 50 సంవత్సరాలు గడిచిన ఇంకా ఆసక్తి తగ్గలేదని తెలిపారు. చదువుతోపాటు క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... నియోజకవర్గంలో క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా ఏడాది పొడవునా వివిధ అంశాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర జాతీయ స్థాయి క్రీడలకు పటాన్‌చెరు కేంద్రంగా నిలవడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, వెంకట్ రెడ్డి, వెంకటేష్, షకీల్, రామ్మోహన్, వినోద్ రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.



## బండి భగీరథ్ వ్యవహారంలో ప్రభుత్వం మౌనం వీడాలి

**మహిళల భద్రతపై ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలి**

**బండి భగీరథ్ పై తక్షణ చర్యలు తీసుకోవాలి**

**కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ కురుమ**



**గండిపేట(క్రైం మిర్రర్):** కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పై నమోదైన పోక్సో కేసులో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ కురుమ డిమాండ్ చేశారు. మైనర్ బాలికకు మద్యం త్రాగించి అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ కేసు అత్యంత తీవ్రమైనదని, ఇలాంటి ఘటనల్లో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావు లేకుండా చట్టం తన పని తాను చేసుకోవాలని అన్నారు. బాధితురాలికి పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పోక్సో వంటి తీవ్రమైన కేసుల్లో ఆలస్యం చేయడం సమాజానికి తప్పు సంకేతాలు పంపినట్లేనని, నిందితుడు ఎవరైనా సరే చట్టం ముందు అందరూ సమానమేనని ప్రభుత్వం నిరూపించాలని ఎస్ వెంకటేష్ పేర్కొన్నారు. అలాగే ఈ కేసులో నిజాలు వెలుగులోకి తీసుకువచ్చి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం రాజీపడకూడదని ఆయన అన్నారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.